
# వర్కింగ్ జర్నలిస్ట్

## సమాచార స్రవంతి

సంపుటి: 13 సంచిక 2 ఫిబ్రవరి 2024 వెల: 5/-రూ.



మీడియా డైరీ 2024 ఆవిష్కరించిన ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డితో ఫెడరేషన్ ప్రతినిధులు





మీడియాపై జరుగుతున్న దాడుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్‌కు ఫెడరేషన్ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించిన దృశ్యం లోపలి చిత్రంలో గాయపడ్డ ఆంధ్రజ్యోతి కృష్ణ



ఫెడరేషన్ నెల్లూరు జిల్లా మహాసభకు హాజరైన వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డికి జ్ఞాపికను బహూకరిస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు



విజయవాడలో ఫెడరేషన్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకల దృశ్యం




కర్నూలులో జిల్లా కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన ఫెడరేషన్ ప్రతినిధులు



కర్నూలులో జిల్లా ఎస్‌పికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన ఫెడరేషన్ ప్రతినిధులు

# వర్కింగ్ జర్నలిస్ట్ సమాచార స్రవంతి

**సంపుటి: 13 ఫిబ్రవరి 2024 సంచిక: 2**

## లోపలి పేజీల్లో...

| | |
|---|---|
| ఎపిడబ్ల్యుజెఎఫ్ డైరీ ఆవిష్కరించిన సజ్జల .............. | 4 |
| ప్రమాదకర వృత్తిగా జర్నలిజం ............. | 5 |
| ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ కృష్ణపై దాడి ................................ | 6 |
| కశ్మీరీ జర్నలిస్టు అసిఫ్ అలీ విడుదల......................... | 10 |
| ఈనాడు కార్యాలయంపై దాడి అమానుషం ............ | 11 |
| యుఎన్ఐ ఆదానీ బంధువుల చేతుల్లోకి! ........................... | 12 |
| జర్నలిస్టు ....................... | 13 |
| భావప్రకటన స్వేచ్ఛ గొంతునులిమే బిల్లు ................................... | 14 |
| జర్నలిస్టుల ఇళ్లస్థలాల ప్రక్రియ వేగవంతం ............................. | 16 |
| కేంద్రానికి లొంగిన జాతీయ మీడియా ..................... | 17 |
| ఎపిడబ్ల్యుజెఎఫ్ ధర్నా ....... | 18 |
| హేలాపురి న్యూస్ విలేకరిపై దాడి ....... | 19 |

**సంపాదకులు**

**ఎ.అమరయ్య**

**వర్కింగ్ ఎడిటర్స్**

**ఎన్.కొండయ్య ఎం.ఎ.రవూఫ్**

**సంపాదకవర్గం**

| | |
|---|---|
| జి.ఆంజనేయులు | ఎస్.వెంకట్రావు |
| వి.నవీన్‌రాజ్ | ఎమ్. శ్రీనివాస్ |
| బి.ఎన్.ప్రసాదరావు | వి.గోపి |
| వి.రామారావు | ఆర్.రామాంజనేయులు |
| బి. ఈశ్వరరావు | కె.వేణుగోపాలరావు |
| టి.మద్దులేటి | వి.భక్తవత్సలం |
| ఒ.శాంతి | ఎస్.మురళీశంకర్ |
| కె.ఎస్.శంకరరావు | జి. శీనుబాబు |
| డి.మధుసూదనరావు | |

**డిజైనర్:**


**PUBLISHED, PRINTED AND EDITED BY**
**G. Anjaneyulu on behalf of**
**Andhra Pradesh Working**
**Journalists Federation**
H. No.1-7-9/A, Plot No.40, 402, Surabhi Sapphire, Golconda 'X' Roads, Musheerabad, Hyderabad-500 020, A.P. Ph:040-27671067

**PRINTED AT**
**Prajashakthi,** M.B. Bhavan, Near RTC Cross Roads, Hyderabad-500 020.

**EDITOR**
**A.Amaraiah**
e-mail:editorworkingjournalist@gmail.com,
Cell: 9912199494
RNI No. APMUL/2009/37690

# మరో పోరాటమే మార్గం!

యేడాదికి ఒకసారి చేసిన పనిని సమీక్షించుకుని బాగా చేశామా ఇంకా బాగా చేయాలా అని ఏ పనిలోనైనా అంచనా వేసుకుంటారు. జర్నలిజంలో మాత్రం అందుకు భిన్నమైన పద్ధతి ఉంది. ఈ యేడాదిలో ఏ ఏ దేశాల్లో ఎన్ని దాడులు జరిగాయి? ఎంతమంది జర్నలిస్టులు విధినిర్వహణలో ఉండగా చనిపోయారు? వాటికి సంబంధించిన కేసులు ఏ ఏ దశల్లో ఉన్నాయో తెలుసుకునే ప్రయత్నం చేస్తాం. 2023 సంవత్సరం జర్నలిస్టులకు అత్యంత ప్రమాదం, నష్టం కలిగించింది. ఈ ఒక్క యేడాదిలో చనిపోయినంతమంది గతంతో పోలిస్తే చాలా ఎక్కువ. స్వేచ్ఛగా పనిచేసే పరిస్థితుల మాట సరేసరి. గాజా-ఇజ్రాయెల్ యుద్ధంలోనే దాదాపు వందమంది జర్నలిస్టులు విధినిర్వహణలో అసువులు బాశారు. మనదేశంలో జర్నలిస్టుల పరిస్థితి కూడా అంతంతమాత్రంగానే ఉంది. అక్రమ కేసులు, దాడులు పెరిగాయి. రాజ్యవ్యవస్థ జర్నలిస్టులపై ఉక్కుపాదం మోపుతోంది. కోర్టుల్లో జర్నలిస్టులకు అనుకూలమైన తీర్పులు వచ్చినప్పటికీ వాటి అమలు మాత్రం సందిగ్ధం. హత్రాస్ కేసులో రెండున్నరేళ్లపైగా జైల్లో గడిపిన కేరళ జర్నలిస్టు కోర్టు అనుమతించినా రాజ్యవ్యవస్థ వేరే కేసుల్లో ఇరికించే ప్రయత్నం చేసింది. ఇదే పరిస్థితి కశ్మీరీ జర్నలిస్ట అసిఫ్ అలీ విషయంలోనూ తప్పలేదు. ఐదేళ్లకు పైగా జైల్లో గడిపాడు. కోర్టు కేసు కొట్టేసినా మరో కేసులో తిరిగి అరెస్టు చేశారు. ఉపా చట్టం పేరుతో దేశంలో ఎందరు జర్నలిస్టులు కేసులు ఎదుర్కొంటున్నారో లెక్కలేదు. నిఘూసంస్థలు వందల, వేల కోట్ల రూపాయలు కాజేసి దేశానికి ఆర్థికంగా నష్టం చేసిన వారిని వదిలేసి వార్తాసంస్థలను బెదిరించే పనిలో పడ్డారు. రాష్ట్రాల్లోని ప్రాంతీయ భాషలో నడిచే మీడియా సంస్థల్లోని జర్నలిస్టుల పరిస్థితి చెప్పనక్కరలేదు. యాజమాన్యాలు తమ వ్యాపార ప్రయోజనాలను, లాభార్జనకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చి విశాల ప్రజాప్రయోజనాన్ని విస్మరించి సొమ్ము చేసుకునే ప్రయత్నాల్లో జర్నలిస్టులు బలిపశువులవుతున్నారు. వీటన్నింటినీ నియంత్రించి దారికి తీసుకురావాల్సిన రాజకీయ వ్యవస్థ కార్పొరేట్ కబంధహస్తాల్లో చిక్కి విలవిల్లాడుతున్నది. ఈ చక్రబంధంలో జర్నలిస్టులు అడకత్తెరలో పోకచెక్కల్లా నలిగిపోతున్నారు. సమాజంలో చుట్టూ ముసురుతున్న సమస్యలను, వాటికి తగిన పరిష్కారాలను సూచించాల్సిన పరిస్థితికి బదులు గాలివాటు ప్రయాణం చేస్తున్నవారే ఎక్కువ. ఈ పరిస్థితి మారేందుకు మొత్తంగా మీడియాలోని అన్ని విభాగాలు కలసికట్టుగా మెరుగైన దిశగా మార్పుకోసం ఆలోచన చేయాలి. ఆ ఆలోచనలను ఆచరణలో సాధ్యం చేసేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించుకోవాలి. ఆ దిశగా చేసే యోచనకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ అంకురార్పణ చేస్తోంది. క్షేత్రస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఆ దిశగా కలిసివచ్చేవారితో ముందుకు అడుగువేసే ప్రయత్నం విజయవంతం కావాలని ఆశిద్దాం.




# ఎపిడబ్ల్యుజెఎఫ్ డైరీని ఆవిష్కరించిన సజ్జల

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) డైరీని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆవిష్కరించారు. తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, రాష్ట్ర నాయకులు గోరంట్లప్ప, విజయవాడ నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.సాంబశివరావు (కలిమిశ్రీ), ఎం.బి.నాథన్, నగర నాయకులు రాఘవేంద్ర శేఖర్, సీనియర్ జర్నలిస్ట్ సురేష్ బాబు కుర్రా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు సంక్రాంతి నాటికి రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు చ్చేందుకు ఏర్పాటు చేయాలని కోరారు. ఏదేవిధంగా రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులకు కొందరికి అక్రిడిటేషన్లు రాలేదని గుర్తుచేసి వారికి కూడా ఇంటిస్థలాల విషయంలో నష్టం జరగడుండా చూడాలని కోరారు. దీనిపై సజ్జల స్పందిస్తూ వీలైనంత త్వరగా జర్నలిస్టులకు ఇంటిస్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదన్నారు. అందుకే జిల్లా కమిటీల ఏర్పాటు కూడా జరిగిందన్నారు. అక్రిడిటేషన్లు లేని జర్నలిస్టుల విషయం జిల్లా కమిటీల దృష్టికి తీసుకువెళితే బాగుంటుందని సూచించారు. ఆరోగ్యబీమా సదుపాయం నిరాటంకంగా కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఎపిడబ్ల్యుజెఎఫ్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. కొన్ని జిల్లా కేంద్రాల్లో కూడా ఫెడరేషన్ కార్యకర్తలు ఈ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర బాధ్యులతో పాటు ఎన్టిఆర్ జిల్లా శాఖ సభ్యులు పాల్గొన్నారు. కేక్ కటింగ్ చేయడంతో కార్యాలయంలో పండుగ వాతావరణం నెలకొంది. జర్నలిస్టుల ఇంటిస్థలాల వ్యవహారంపై ప్రభుత్వం చేసిన ప్రకటనతో జర్నలిస్టులు ఇంటిస్థలం వస్తుందనే ఆశతో ఎదురుచూస్తున్నారని కార్యాక్రమంలో పాల్గొన్న జర్నలిస్టులు తెలియజేశారు. ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు, కార్యదర్శి ఒ.శాంతి, సీనియర్ జర్నలిస్టులు ఎం.ఎ.రవూఫ్, రంగారెడ్డి, వలి, ఎన్టిఆర్ జిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులు కె.కలిమిశ్రీ, ఎం.బి.నాథన్, కోశాధికారి శ్రీనివాస్‌తో పాటు జర్నలిస్టుల పిల్లలు కూడా కార్యక్రమంలో పాలు పంచుకున్నారు.



# ప్రమాదకర వృత్తిగా జర్నలిజం



ప్రపంచంలోని ప్రమాదకర వృత్తుల్లో జర్నలిజం ఒకటి. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను యుద్ధ నేరాల కింద పరిగణించాల్సిందేనని ఐక్యరాజ్యసమితి అభిప్రాయపడింది. గత మూడు దశాబ్దాలుగా జర్నలిజం ప్రపంచంలోని అత్యంత ప్రమాదకరమైన వృత్తులలో ఒకటిగా మారుతుందని ఇంటర్నేషనల్ ప్రెస్ ఇన్స్టిట్యూట్ తెలిపింది. తమ పనిని నిర్వహించే క్రమంలో 1600 మంది జర్నలిస్టులు మరణించారని యునెస్కో నివేదిక తెలుపుతున్నది. యునెస్కో అంచనాల ప్రకారం కేవలం పదికి ఒక కేసులో మాత్రమే ఈ నేరాలకు బాధ్యులు చట్టం ముందు విచారణను ఎదుర్కొంటున్నారు. అంతర్జాతీయ చట్టం, ఇతర ఒప్పందాల ప్రకారం జర్నలిస్టులకు వ్యతిరేకంగా జరిగే నేరాలను పూర్తిగా విచారించి బాధ్యులను గుర్తించి వారిపై తగు చర్యలు తీసుకోవడంలో దేశాలు భయంకరమైన వైఫల్యాన్ని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అంతర్జాతీయ చట్టం ప్రకారం జర్నలిస్టులపై జరిగిన దాడులపై తక్షణమే, పూర్తిగా, స్వతంత్రంగా దర్యాప్తు చేయడం, బాధ్యులను విచారించడం ప్రభుత్వాల బాధ్యత.

# కర్నూలులో నూతన సంవత్సర వేడుకలు

నూతన సంవత్సరం 2024 పురస్కరించుకుని ఏపీడబ్ల్యూజేఎఫ్ బృందం జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన, జిల్లా ఎస్పీ జి.కృష్ణ కాంత్‌లకు ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.మద్దిలేటి, జిల్లా కన్వీనర్ నాగేంద్ర, కో కన్వీనర్ రమేష్, నగర అధ్యక్షుడు శివకుమార్, సీనియర్ నాయకులు చిన్న రామాంజనేయులు, సుజాత, చంద్ర మోహన్‌లు పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి తప్పనిసరిగా చేస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల ఇంటిస్థలం వ్యవహారంలో అందరికీ న్యాయం చేస్తామన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో కేక్ కట్టింగ్ చేసి స్వీట్స్ పంచి జర్నలిస్టులకు శు భాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీరామ్,విజయ్ కుమార్,శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# దామోదర్ ఆత్మహత్యపై విచారణకు డిమాండ్

శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం సాక్షి విలేఖరి దామోదర్ ఆత్మహత్య పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తోంది. దామోదర్ మృతి పట్ల సంతాపం ప్రకటిస్తూ సాక్షి విలేఖరి దామోదర్ ఆత్మహత్యకు దారి తీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరపటం అవసరమని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల కాలంలో తెలుగు నాట సంభవిస్తున్న వివిధ సంఘటనల్లో జర్నలిస్టులు ఆత్మహత్యలు చేసుకోవడం పరిపాటిగా మారింది. ఈ పరిస్థితి పై రాష్ట్ర ప్రభుత్వం స్పందించటం తక్షణ కర్తవ్యంగా ఫెడరేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతోంది. లావేరు విలేఖరి ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఫెడరేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నది. చిన్న, పెద్ద తేడాలేకుండా వివిధ సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు ఆత్మహత్యలకు పాల్పడడం, దీనిపై యాజమాన్యాలు మౌనం వహించడం చూస్తుంటే పనిభారం ప్రధానసమస్యగా మారినట్లు కనిపిస్తున్నదని ఎపిడబ్ల్యుజెఎఫ్ అభిప్రాయపడుతున్నది.

# ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ కృష్ణపై దాడి



## వెల్లువెత్తిన నిరసన రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు

అనంతపురం జిల్లా రాప్తాడులో జరుగుతున్న సిద్ధం సభ కవరేజీకి వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ కృష్ణపై అల్లరిమూకలు విచక్షణారహితంగా దాడి చేశాయి. దాదాపు అరగంటపాటు వెంటాడి దారుణంగా కొట్టారు. ఈ సంఘటన రాష్ట్రంలోని మొత్తం జర్నలిస్టులోకాన్ని కలవరపరిచింది. రాజకీయపార్టీల సభలు, సమావేశాల సందర్భంగా ఇటువంటి సంఘటన జరగడం ఇటీవలకాలంలో ఇదే ప్రథమం. సాధారణంగా రాజకీయ పార్టీల కార్యకర్తలు ఇటువంటి సభల సమయంలో సంయమనం పాటిస్తారు. తమ సభకు సంబంధించిన ఫోటోలు, విశేషాలు బాగా రావాలని కోరుకుంటారు. ఇక్కడ అందుకు భిన్నంగా దాడి జరిగింది. దాడి చేసిన వారు మద్యం మత్తులో ఉన్నారని తెలిసింది. తాను ఫోటో జర్నలిస్టులనని చెబుతున్నప్పటికీ ఎంతమాత్రం



పట్టించుకోకుండా దాడి చేశారు. ఈ సంఘటన పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ తీవ్రంగా ఖండిస్తోంది. దాడికి బాధ్యులైనవారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. జరుగుతున్న ఇటువంటి దాడుల సంఘటనలను దృష్టిలో పెట్టుకుని జర్నలిస్టుల దాడుల నిరోధ కమిటీల ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి చేసింది. హూంమంత్రి నేతృత్వంలో రాష్ట్రస్థాయిలో హైపవర్ కమిటీ, జిల్లాల్లో ఎస్పి నాయకత్వంలో కమిటీల ఏర్పాటుకు ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయి. కానీ ఇప్పటివరకు ఆ కమిటీల నియామకం జరగలేదు.

**రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు**

ఫోటోగ్రాఫర్ కృష్ణపై జరిగిన దాడిని నిరసిస్తూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా శాఖలు ఆందోళన చేపట్టాయి. పలు జిల్లాల్లో ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించాయి. కొన్నిచోట్ల జిల్లా అధికారులను కలిసి వినతిపత్రాలు అందించాయి.

ఫోటోగ్రాఫర్ పై దాడిని ఖండించిన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపి డబ్ల్యు జె ఎఫ్) ఏలూరు జిల్లా శాఖ ఖండించింది. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, ఏపీడబ్ల్యుజేఎఫ్ ఏలూరు జిల్లా శాఖ డిమాండ్ చేసింది. జిల్లాఅధ్యక్ష ,కార్యదర్శులు ఎస్ డి జబీర్, వైవి హరీష్ లతో జిల్లా నాయకులు రాష్ట్ర కార్యదర్శి కె ఎస్ శంకర్రావు, సీనియర్ నాయకులు కె బాలసౌరి, జిల్లా ఉపాధ్యక్షులు కే సోమశేఖర్, బీసీఎన్ ఛానల్ ఎడిటర్ ఎస్ కే బాజ్జి, ప్రజాశక్తి స్టాఫ్ రిపోర్టర్ గంగరాజు, చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు కె నాగ చిన్నారావు, కార్యదర్శి జి.శ్రీనివాసరావు, నూజివీడు నియోజకవర్గ అధ్యక్షులు అబ్బాస్ అలీ, దెందులూరు నియోజకవర్గ అధ్యక్షులు ఋషి రావు, వెంకట్రావు జిల్లా ఉపాధ్యక్షులు అప్పారావు, పోలవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్.రాజశేఖర్, సీనియర్ జర్నలిస్ట్ లు యర్రా జయదాసు, మిల్టన్ ప్రతాప్, సూర్య దినపత్రిక మేనేజర్ పసుమర్తి రాము, మాట్లాడుతూ తదితరులు మాట్లాడుతూ రాప్తాడు ఘటనను ప్రతి వారు నిరసించాలన్నారు.

నేడు రాజకీయ దాడులు జరుగుతున్నాయని పత్రికా స్వేచ్ఛ రోజు, రోజుకు దిగజారి పోతుందని, జర్నలిస్టులపై ఫోటోగ్రాఫర్లపై దాడులు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఫోటోగ్రాఫర్ పై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి వారిని శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫోటోగ్రాఫర్ క్రృష్ణకు తమ సంఘీభావాన్ని తెలియజేశారు .ఇటీవల కాలంలో దేశంలోనూ, రాష్ట్రంలోనూ రాజకీయపరమైన దాడులు పెరిగిపోతున్నాయిని వేదింపులకు, కుట్రకేసులకు జర్నలిస్టులు బలి అయిపోతున్నారని, ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉన్న ఫోటోగ్రాఫర్ పై దాడి చేయడను ప్రజాతంత్ర వాదులు ఖండించాలని రాష్ట్ర స్థాయిలోను జిల్లాల స్థాయిలోను జర్నలిస్టులపై దాడులు జరగకుండా ఉండడానికి మానిటరింగ్ సెల్లను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

**విజయవాడలో కలెక్టరుకు వినతి**

అనంతపురం జిల్లా రాప్తాదులో జరిగిన సిద్ధం సభ కవరేజీకి వెళ్లిన ఆంధ్రజ్యోతి



ఫొటోగ్రాఫర్ శ్రీకష్ణపై దాడి చేసిన వైసిపి కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావుకు జర్నలిస్టులు వినతిపత్రం సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఎపిబిజెఎ) ఆధ్వర్యాన సోమవారం కలెక్టర్ డిల్లీరావును జర్నలిస్టులు కలిశారు. రాప్తాడులో ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడి తీరును ఆయనకు వివరించారు. అనంతరం ఫొటో జర్నలిస్ట్‌పై దాడిని ఖండిస్తూ ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ ఉ ద్యోగులకు ఉండే చట్టబద్ధమైన రక్షణ లాంటి పద్ధతిని విధి నిర్వహణలో ఉండే వర్కింగ్ జర్నలిస్టులకు కూడా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, రాష్ట్ర నాయకులు షేక్ ఖాజావలి, నగర కార్యదర్శి ఎం.బి.నాథన్, ఎపిబిజెఎ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.వి.రంగారెడ్డి, జర్నలిస్టులు యు.ఉదయభాస్కర్, ఫొటో జర్నలిస్టులు జి.నారాయణ, లక్ష్మణ, ఫెడరేషన్ నగర నాయకులు వి.హెచ్.రాజు, పశ్చిమ సిటీ కార్యదర్శి వి.యు.ఫణికుమార్, నాయకులు బాష, కారే శ్రీనివాస్, ఎ.శ్రీనివాస్, రమేష్, హరిప్రసాద్‌రెడ్డి, వీర్లంకయ్య, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలులో

అనంతపురం జిల్లా రాప్తాడు ముఖ్యమంత్రి సభలో పత్రిక వృత్తిలో భాగంగా ప్రోగ్రాం కవరేజ్ కు వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫోటో గ్రాఫర్ కృష్ణపై దాడి చేసిన వ్యక్తుల అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని జర్నలిస్ట్ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జె.ఏ.సి) ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఉమ్మడి జిల్లాల కన్వీనర్ టిజి.ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధి లాగా ఉన్న జర్నలిస్ట్ లపై దాడి చేయడం అంటే ప్రజాస్వామ్యం పై దాడి చేయడమే అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం అయిన మీడియా ప్రతినిధులు దాడి చేయడం దుర్మార్గపు చర్యగా వారు అభివర్ణించారు. ప్రజాస్వామ్యంలో పాత్రికేయ వృత్తి అతి కీలకమైనదని అలాంటి మీడియా ప్రతినిధులు, రిపోర్టర్ల,ఫోటో, వీడియో గ్రాఫర్ లపై దాడులు చేయడం పరిపాటిగా మారిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడులు చేస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షిస్తే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగవని అలాంటి పని చేయకపోవడంతోనే రాష్ట్రంలో దాడులు పెరిగిపోతున్నాయి అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా కన్వీనర్ టి.జి.ప్రసాద్,కో కన్వీనర్లు రామకృష్ణ,జి.సత్తార్, సాయి కుమార్ నాయుడు, పానుగంటి చంద్రయ్య, సత్యనారాయణ, పరమేష్, ఇస్మాయిల్,అశోక్ గౌడ్,విజయ్‌లు ఖండించారు. వృత్తిలో భాగంగా వెళ్లిన వ్యక్తిని విచక్షణ రహితంగా దాడి చేయడం దుర్మార్గపు చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు.దాడి చేసిన దుండగులను వెంటనే



అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ సంఘాల నాయకులు, జర్నలిస్ట్లు పెద్దఎత్తున పాల్గొన్నారు.

**భీమవరంలో**

రాష్ట్రంలోను, దేశంలోనూ మీడియా సెక్టార్ ను కాపాడాలని ,జర్నలిస్టులకు ప్రాణ రక్షణ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు గుండా రామకృష్ణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. మీడియా రంగంను కాపాడాలని, జర్నలిస్టులకు, ఫోటోగ్రాఫర్స్ , వీడియోగ్రాపర్స్కు ప్రాణ రక్షణ, భద్రత కల్పించాలని మంగళవారం భీమవరం తహసిల్దార్ కార్యాలయం వద్ద ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మీడియా సెక్టార్ను ఫోర్త్ ఎస్టేట్గా పరిగణించి ప్రభుత్వంలు , రాజకీయ పార్టీలు స్నేహపూర్వకంగా వ్యవహరించాలన్నారు అంతే తప్ప జర్నలిస్టులు, ఫోటోగ్రాఫర్స్ పై ప్రతీకార దాడులు చేయడం తగదన్నారు. ఆదివారం రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ కృష్ణ పై జరిగిన దాడి అత్యంత దుర్మార్గమన్నారు .కృష్ణకు వైద్య సహాయం అందించాలని నష్టపరిహారన్ని చెల్లించాలని ఆయన ప్రభుత్వంను డిమాండ్ చేశారు భీమవరం ఏపీడబ్ల్యూజేఎఫ్ శాఖ అధ్యక్షుడు వేగిరాజు రాధాకృష్ణ మాట్లాడుతూ జిల్లాలోని రాష్ట్రంలోనూ ఇటీవల జర్నలిస్టులపై ఫోటోగ్రాఫర్లపై దాడులు వేధింపులు పెరిగిపోయాయన్నారు జిల్లాలో నరసాపురంలో సీనియర్ జర్నలిస్టు సిహెచ్ వెంకటేశ్వరరావు మీద చింతలపూడి లో సీనియర్ జర్నలిస్ట్ శంకర్రావు మీద దాడులు ,వేధింపులు జరిగాయని రాష్ట్రంలో కూడా దాడులు పెరిగిపోయాయన్నారు అనంతపురం జిల్లా రాప్తాడులో వైఎస్ఆర్సిపి నిర్వహించిన సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ కృష్ణ పై వైఎస్ఆర్సీపీ శ్రేణులు మూకుమ్మడి దాడి జరగడం జర్నలిస్టులపై దాడులకు పరాకాష్టగా చెప్పవచ్చొన్నారు దేశంలో భయభక్తులు ఉంటే నేడు మీడియా రంగంలోకి చెందిన వారే భయపడే పరిస్థితిలో దేశంలో నెలకొన్నాయన్నారు. ప్రజాతంత్ర వాదులు అభ్యుదయవాదులు అభివృద్ధి కాముకులు పత్రికా స్వేచ్ఛకు బలపరుస్తూ తమ సంఘీభావం తెలియజేయాలన్నారు నియంతృత విధానాలను ఖండించాలని కోరారు %ఖచీజుూజూ% నివేదిక ప్రకారం 2020 లో భారత దేశంలో పత్రిక స్వేచ్ఛ 150 స్థానంలో ఉంటే నేడు మరింతగా దిగజారి 161 స్థానాన్ని చేరుకుందని ఆవేదన వ్యక్తం చేశారు.



కూడా మీడియా రంగంపై దాడులు వేధింపులు కుట్ర కేసులు పెరిగిపోయాయన్నారు ప్రజల కోసం వార్తలు రాసి, సమాచారం సేకరిస్తున్న వారిని రాజకీయ పార్టీలు తమ శత్రువులుగా భావించి జర్నలిస్టులపై దాడులు చేయడంతో పాటు ఆయా మీడియా సంస్థలపై కేసులు పెట్టి స్థంబింప చేస్తున్నారన్నారు.. జర్నలిస్టులు ఏ సంస్థలో పనిచేసిన వృత్తి ధర్మం , ప్రజాసమస్యల పరిష్కారం కోసం పనిచేస్తారన్నారు వారిని టార్గెట్ గా చేసుకోవడం తగదన్నారు వార్తలపై బినాభిప్రాయాలు ఉంటే నిరసనలు తెలువవచ్చని ఖండన లాంటివి ఇవ్వవచ్చు అన్నారు . న్యాయస్థానంలను ఆశ్రయించవచ్చు అన్నారు పత్రికా రంగం అంటే ఒకనాడు అన్ని వ్యవస్థలకు

ప్రభుత్వాలు రాజకీయ పార్టీలు జర్నలిస్టులపై దాడులు కొనసాగిస్తే జర్నలిస్టు సంఘాలు రాష్ట్రం లోను,దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. డిప్యూటీ తాసిల్దార్ గ్రంధి పవన్ కుమార్ కు వినతిపత్రం అందించారు ఈ కార్యక్రమంలో భీమవరం ఏపీ డబ్ల్యూజేఎఫ్ కన్వీనర్ కేఎల్ఎస్ ధనరాజు (అంతఃపురం నాని )నాయకులు తిరుమల ప్రసాద్, బిట్రా శివకుమార్, యు.నరేష్, జయక్రృష్ణ, ఆమనాపు వెంకటేశ్వరరావు (ఆదిత్య బావి)అంజిబాబు,దొంగ సత్తిబాబు ,మండ సతీష్, క్రాంతి, ప్రసన్న , వి. బాబ్జి, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు




# కశ్మీరీ జర్నలిస్టు ఆసిఫ్ అలీ విడుదల

కశ్మీరీ జర్నలిస్టు ఆసిఫ్ అలీ విడుదల అయ్యారు. ఆయన జైలు పాలై ఇప్పటికి ఐదు సంవత్సరాల, ఆరు నెలల, ఒకరోజు. గత డిసెంబర్ లోనే ఆయన మీద ఉన్న ఉపా కేసును ఆధారాలు లేక జమ్మూ కశ్మీర్ హైకోర్టు కొట్టి వేసింది. అయినా ఆయన విడుదలకు ఇంకా రెండు నెలల పైనే పట్టింది. హోమ్ డిపార్ట్ మెంట్ నుండీ, మేజిస్ట్రేట్ కోర్ట్ నుండి ఆదేశాలు లేవని ఆయన విడుదలను ఆపేశారు. ఆయన తన జైలు జీవితమంతా ఉత్తరప్రదేశ్ ఆగ్రాలోని అంబేద్కర్ నగర్ సెంట్రల్ జైల్లో గడిపారు. ఉత్తరప్రదేశ్ జైళ్ల గురించి మనకు తెలియనది కాదు. అక్కడ ఆయన దుర్భర జీవితం అనుభవించి ఉండాలి.

ఆసిఫ్ అలీ కశ్మీర్ నెరేటర్ అనే పత్రికలో పని చేసే వారు. 2018 ఆగస్టు 27న ఆయనను అరెస్టు చేశారు. బురాన్ వని (కావాలనే పేరు తప్పు రాశాను) మీద ఆయన రాసిన ఒక వ్యాసం ఆ అరెస్టుకు కారణం. బురాన్ వని 2016లో జరిగిన ఎదురు కాల్పుల్లో మరణించిన 23 ఏళ్ల సాయుధ పోరాట యువకుడు. కశ్మీరీ సమాజం ఇప్పటికీ అతన్ని తమ ఇంటి కొడుకుగా భావిస్తుంది. ఆసిఫ్ అలీ రాసిన వ్యాసంలో ఆయన బుహాన్ సంస్థ అయిన హిజ్బుల్ ముజాయిద్దీన్‌లో పని చేస్తున్న సాయుధులు కాని వారిని ఇంటర్వ్యూ చేశారు. ఆ సాకుతో ఆయన సాయుధులకు ఆశ్రయం ఇస్తున్నాడని చెబుతూ అరెస్టు ఉపా కింద అరెస్టు చేశారు. రిలీజ్ కాకుండా పీఎస్ ఏను బనాయించారు.

2022లో ఆయన ఒక సారి బెయిలు వచ్చినా కశ్మీర్ కౌంటర్ ఇంటెలిజెన్స్ వాళ్లు మళ్లీ పీఎస్ ఏను మోపి డిటెన్షన్‌లోనే ఉంచారు. ఎలాంటి సాక్షాధారాలు లేకుండా ఆసిఫ్ అలీ ఐదు సంవత్సరాలుకు పైనే జైల్లో గడపాల్సి వచ్చింది.

ఆయన అరెస్టును అంతర్జాతీయంగా అనేక జర్నలిస్టు సంస్థలు ఖండించాయి. 2019లో ఆయనకు అమెరికా నేషనల్ ప్రెస్ క్లబ్ ఏటా ఇచ్చే జాన్ అబూకోన్ ప్రెస్ ఫ్రీడం అవార్డును ఇచ్చింది. సంకెళ్లు వేసిన చేతులతో ఆసిఫ్ అలీ ఫోటోలు అమెరికాలో టీషర్టులపై కనిపిస్తాయి.




# ఈనాడు కార్యాలయంపై దాడి అమానుషం

ఈనాడు కార్యాలయం పై కాటసాని అనుచరులు దాడి చేయడం ఏమైనా చర్య మీడియా వార్తలు రాస్తే చట్టపరమైనటువంటి చర్యలు తీసుకోవాలని తప్ప ఇలాంటి దాడులను చేయడం బాధ్యతరాహిత్యం కాబట్టి జిల్లా రక్షణ అధికారి తక్షణమే చర్యలు తీసుకొని దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలని చెప్పి ఏపీడబ్ల్యూజేఎఫ్ గా డిమాండ్ చేస్తున్నాం. దేశానికి నాలుగవ స్తంభం అయినటువంటి మీడియాపై రోజురోజుకు దాడులు పెరగడం తప్ప ఎక్కడా కూడా అరికట్టిన దాఖలాలు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు చేపట్టలేదు. సుప్రీంకోర్టు జర్నలిస్టులపై దాడి జరిగిన దుర్భాషలాడిన నాన్ నాన్ బెయిలబుల్ కేసులను నమోదు చేయాలని తీర్పులు ఇచ్చిన పక్కనపెట్టి రోజురోజుకు జర్నలిస్టులపై దాడులు చెలరేగుతున్నాయి తప్ప ఎక్కడ కూడా అరికట్టిన దాఖలాలు లేవు. నిన్న ఆంధ్రజ్యోతి కెమెరా మ్యాన్ పై దాడి ఈరోజు ఈనాడు కార్యాలయం పై దాడి ఇలా రోజురోజుకు దాడులు పెరుగుతున్నాయి తప్ప తగ్గలేదు. పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయకపోతే ఏపీడబ్ల్యూజేఎఫ్ గా రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు నిరసనలు చేపడతామని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, రాష్ట్ర నాయకులు గోరంట్లప్ప జిల్లా కన్వీనర్ నాగేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు.

ఈనాడు కార్యాలయంపై దాడి అమానుషం ఏపీడబ్ల్యూజేఎఫ్,ఎపియుడబ్ల్యుజె, సీపీఎం,టిడిపి, సీపీఐ,జనసేనా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా.

ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, ఎపియుడబ్ల్యుజె జిల్లా అధ్యక్షుడు ఈ యన్ రాజు ,జిల్లా కన్వీనర్ నాగేంద్ర,నగర అధ్యక్షుడు శివకుమార్,ఉపాధ్యక్షుడు విద్యాసాగర్,రఫిక్ బాషా,మధు,మెట్రో స్టాఫ్ రిపోర్టర్ మధు,సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.వి నారాయణ, నగర కార్యాదర్శులు రాముడు,రాజశేఖర్,జనసేన పార్టీ కర్నూలు అసెంబ్లీ కన్వీనర్ హర్షద్, శేఖర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్,ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణ రెడ్డి,ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి చంద్ర శేఖర్, రామాంజనేయులు పాల్గొన్నారు. మండల కేంద్రమైన దేవనకొండలో జర్నలిస్టులపై దాడిని ఖండిస్తూ నిరసన తెలియజేస్తున్న దృశ్యం ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా చిన్న రామాంజనేయులు పాల్గొనడం జరిగింది.

# యుఎన్ఐ ఆదానీ బంధువుల చేతుల్లోకి!

దేశంలో వార్తా సేకరణలో ప్రత్యేకతను చాటుకున్న యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా ఉద్యోగుల బకాయిల వేతనాలు 125 కోట్లను తక్షణమే చెల్లించాలని నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు (ఎన్.ఎ.జె), ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ (డి.యు.జె), ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ ఫెడరేషన్ (ఎ.పి.డబ్ల్యు.జె.ఎఫ్)లు డిమాండ్ చేశాయి. అలాగే యుఎన్ఐలో పనిచేస్తున్న 700 మంది జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఎన్ఎజె అధ్యక్ష ప్రధానకార్యదర్శులు ఎస్‌కె పాండే, ఎన్ కొండయ్య, డియుజె అధ్యక్ష కార్యదర్శులు సుజాత మథోక్, జిగ్నేష్, ఎపిడబ్ల్యు ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు ఒక ప్రకటన విడుదల చేశారు.

2023 ఏప్రిల్‌లో యు ఎన్ ఐ ఉద్యోగులు వేతనాల కోసం క్లెమ్ చేసుకుంటే యు ఎన్ ఐ ఎన్ పి ఎల్ టి లో దివాలా పిటిషన్ దాఖలు చేసిందని పేర్కొన్నారు. ఎన్సీఎల్టీలో వేసిన బిడ్డింగ్‌లో ఎక్కువ సంస్థలు పాల్గొనే అవకాశం ఉన్నా కేవలం ఆదానీ బంధువు రాకేష్ రమణ్‌భాయ్ షా సంస్థ ఒకటే బిడ్ వేసిందని తెలిపారు. తక్కువకు బిడ్ వేస్తే ఉద్యోగులకు రావాల్సిన బకాయిలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని తక్షణం ఈ ప్రక్రియను నిలుపుదల చేసి ఓపెన్ బిడ్డింగ్‌లో ఎక్కువ సంస్థలు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కోరారు. యుఎన్ఐలో పనిచేస్తున్న ఒక్కొక్క జర్నలిస్టుకు సగటున 18 నుంచి 42 లక్షల వరకు బకాయిలు ఉన్నాయని తెలిపారు. మార్చి 2017 నుండి ఉన్న వేతన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు.




# రత్నాకర్‌కు తెలుగు సినిమా అవార్డు

తెనాలి పట్టణానికి చెందిన జర్నలిస్టు, సినీ దర్శకుడు కనపర్తి రత్నాకర్ తెలుగు సినిమా లెజెండ్రీ మెమోరియల్ అవార్డు అందుకున్నారు. నేస్తం ఫౌండేషన్ తెలుగు సినిమా వేదిక సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ ప్రసాదు ల్యాబ్‌లో తెలుగు సినిమా పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సినీ రంగంలో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి తెలుగు సినిమా లెజెండరీ మెమోరియల్ అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నిర్మాత భారతీయుడు జెంటిల్మెన్ చిత్రాలను నిర్మించిన ఏఎం రత్నం పాల్గొన్నారు. నిర్వాహకులు రత్నాకర్‌కు ఏ ఎమ్ రత్నం చేతుల మీదుగా అవార్డును అందించారు. నిర్వాహకులు జేవి మోహన గౌడ, పి విజయంద్ర వర్మ రత్నాకర్‌ను సత్కరించారు. అతిధులుగా హాస్యనటులు బాబు మోహన్ చిట్టిబాబు సీనియర్ కథానాయక కవిత, నటి శివపార్వతి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి తెనాలి పట్టణంలోని ప్రముఖులు పలువురు హాజరై తెలుగు సినిమా అవార్డు అందుకున్న రత్నాకర్‌ను అభినందించారు. ఒకపక్క జర్నలిస్టు ఉద్యమంలో పనిచేస్తూ మరోవక్క సినీరంగంలో తనదైన ముద్ర వేసుకుంటున్న రత్నాకర్ ఎదగాలని కోరారు.

# జర్నలిస్టు

"సిరికింజెప్పడు శంకు చక్రయుగంబు చేదోయి సంధింపడే పరివారంబును" అనేది గజేంద్రమోక్షంలో ఒక శ్లోకం. విష్ణువు గజేంద్రుని కాపాడే తొందరలో తన ప్రియ సఖి అయిన లక్ష్మీదేవికి కూడా చెప్పక శంఖచక్ర గదాది ఆయుధములను చేపట్టక పరివారంబును పిలువక తన వాహనమైన గరుడునిపై కూడా నదిరోహింపక జారిన జుట్టును గమనింపక వేడుకలో లక్ష్మీదేవి కొంగుతో ముడి వేసిన అమె పైటకొంగును కూడా గమనింపక తొందరపాటుతో ఈడ్చుకుని బయలుదేరినని ఆ శ్లోకం సారాంశం. వాస్తవానికి విష్ణువు అలా వెళ్ళాడో లేదో మనకు తెలియదు గాని ఏదైనా ఒక సంఘటన జరిగిందని తెలిసిన మరుక్షణం ఆగమేఘాల మీద ఆ సంఘటన స్థలికి చేరేవాడు జర్నలిస్టు. కలం పట్టిన సైనికుడు జర్నలిస్టు. కలం పట్టినా, కెమెరా పట్టిన బాధితుల పక్షాన నిలుస్తాడు. అక్షరాలను తూటాల్లా పేలుస్తాడు. విధి నిర్వహణలో తన ప్రాణాలను సైతం ఫణంగా పెడతాడు. విత్తును మొలకెత్తించడానికి రైతు ఎంత శ్రమ పడతాడో, ఒక వార్తను ప్రపంచానికి తెలియ చెప్పడానికి జర్నలిస్టు అంతే శ్రమ పడతాడు. ఒక్కోసారి సర్వశక్తులు ఒడ్డి పోరాడతాడు. రైతుది బ్రతుకు పోరాటమైతే జర్నలిస్టుది మంచిని బతికించాలని ఆరాటం.

గత మూడు దశాబ్దాలుగా జర్నలిజం ప్రపంచంలోని అత్యంత ప్రమాదకరమైన వృత్తులలో ఒకటిగా మారిందని ఇంటర్నేషనల్ ప్రెస్ ఇన్స్టిట్యూట్ పేర్కొంది. ఈ కాలంలో విధి నిర్వహణలో 1600 మంది జర్నలిస్టులు మరణించారని నివేదిక వెల్లడించింది. అంతర్జాతీయ చట్టం, ఇతర ఒప్పందాల ప్రకారం జర్నలిస్టులకు వ్యతిరేకంగా జరిగే నేరాలను పూర్తిగా విచారించి బాధ్యులను గుర్తించి వారిపై తగు చర్యలు తీసుకోవడంలో దేశాలు వైఫల్యాన్ని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కనుకనే జర్నలిస్టులపై దాడులను యుద్ధ నేరాల కింద పరిగణించాల్సిందేనని ఐరాస స్పష్టం చేసింది. నేడు జర్నలిస్టుల ప్రాణాలు గాలిలో దీపంలా మారిపోతున్నాయి. గతేడాది ప్రపంచవ్యాప్తంగా 120 మంది జర్నలిస్టులు హత్యగావించబడ్డారని అంతర్జాతీయ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఐఎఫ్‌జె) వెల్లడించింది. గ్లోబల్ మీడియా వాచ్ డాగ్ కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్ సిపిజే సమాచారం ప్రకారం దశాబ్ద కాలంలో 2023 జర్నలిస్టులకు ఘోరమైన సంవత్సరం. ఈ ఏడాదిలో 99 మంది జర్నలిస్టులు చనిపోయారు. ఇందులో 77 మంది గాజాపై ఇశ్రాయిల్ నరమేధాన్ని రిపోర్టింగ్ చేస్తున్న సమయంలోనే ప్రాణాలు కోల్పోవడం గమనార్హం. తాజా లెక్కల ప్రకారం ఇజ్రాయిల్ గాజా యుద్ధంలో మరణించిన జర్నలిస్టుల సంఖ్య 88 కి పెరిగిందని సిపిజే తన ప్రాథమిక దర్యాప్తులో వెల్లడించింది. ఇజ్రాయిల్ సైన్యం డజన్లకొద్దీ జర్నలిస్టులను ఉద్దేశపూర్వకంగానే చంపింది అన్నది నిజమైతే అది యుద్ధనేరంగా పరిగణించబడుతుంది.

గాజాపై ఇజ్రాయిల్‌లో దాడి లాంటిదే... భారతదేశంలోనూ మైనారిటీలు, జర్నలిస్టులు, మేధావులపై నిరంకుశ దాడి జరుగుతోంది. మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం వందలాది జర్నలిస్టులపై దేశద్రోహం ఉపా చట్టం కేసులను పెట్టింది. న్యూస్ క్లిక్ పోర్టల్ పై కేసును నమోదు చేయించింది. అందులో పనిచేసే జర్నలిస్టులపై దేశద్రోహం కేసులు పెట్టించింది. పెగాసెస్ స్పైవేర్‌తో 40 మంది జర్నలిస్టులపై కేంద్రం పెట్టిన నిఘా కూడా బయటపడింది. అనేక మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనేకమంది మహిళా జర్నలిస్టులపైన, వారి కుటుంబ సభ్యులపైన, వారి ఇళ్లపైన భౌతిక దాడులు చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్‌లో భారతదేశం 2020లో 180 దేశాలలో 142వ స్థానంలో ఉంటే 2023లో అది 161వ స్థానానికి దిగజారింది. ఇది మోడీ ప్రభుత్వంలో మీడియాకు దక్కిన గౌరవం. ప్రజాస్వామ్యానికి నాలుగవ స్తంభమైన మీడియాను ఎంతగా నరుకుతున్నారో కేంద్ర ప్రభుత్వ వైఖరిని చూస్తేనే అర్థమవుతుంది. యుద్ధ రంగంలో నిలబడి కవిత్వం రాయడం గొప్ప ఆనందాన్నిస్తుంది అంటాడు కవి. నిరంకుశత్వం పెరిగే కొద్దీ జర్నలిస్టు కలం, కెమెరా కూడా తన వాడి పెంచుతుంది తప్ప వెనక్కు తగ్గదు.

(ప్రజాశక్తి సౌజన్యంతో)

# భావ ప్రకటన గొంతు నులిమే బిల్లు

ప్రస్తుతమున్న చట్టాలను ఉపయోగించి కూడా స్వతంత్ర మీడియా సంస్థల్లో, కంటెంట్ క్రియేటర్లల్లో ఒక రకమైన భయాందోళనలను ఈ ప్రభుత్వం సృష్టిస్తోంది. అనేకమంది జర్నలిస్టులను జైళ్ళలో పెడుతోంది. తప్పుడు కేసులు బనాయిస్తోంది. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే వారి కంటెంట్‌ను ప్రచురించకుండా లేదా ప్రసారం కానివ్వకుండా అడ్డుకుంటోంది. ఈ పాలకపార్టీ, దాని హంగుదారులైన సంఘుపరివార్ అనుబంధ సంఘాలు సత్యం కోసం పోరాడే నిరసనకారుల గొంతులు నొక్కేందుకు వీధిగూండాలుగా, ట్రోలర్లుగా విరుచుకు పడుతున్నాయి. ఈ నిగూఢ శక్తుల విలయ విహారం నేపథ్యంలో చూస్తే నిరసనను, ధిక్కారాన్ని పీక నులిమే క్రూర ప్రయత్నమే ప్రసారబిల్లని స్పష్టమవుతుంది. భారతదేశంలో ప్రజాస్వామ్యం పరిరక్షించబడాలంటే అన్ని ప్రజాతంత్ర శక్తులు ఏకమై కలిసికట్టుగా దీనిపై పోరాడాలి.

భావ ప్రకటనా స్వేచ్ఛను నియంత్రించడానికి, దాని గొంతు నులిమివేయడానికి మోడీ ప్రభుత్వం తీసుకువచ్చినదే బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసెస్ (నియంత్రణ) బిల్లు, 2023. దీనిపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఈ ముసాయిదా ప్రతిని 2023 నవంబరులో అందరికీ పంపిణీ చేశారు. దాదాపు మూడు దశాబ్దాలుగా అమలులో వున్న కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్స్ రెగ్యులేషన్ యాక్ట్, 1995 స్థానంలో దీన్ని ప్రవేశపెట్టనున్నారు. దీనికి ముందుగా, టెలికమ్యూనికేషన్స్ యాక్ట్ 2023, డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ 2023, అంతకు ముందు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (మధ్యవర్తి మార్గదర్శకాలు మరియు డిజిటల్ మీడియా నైతిక నిబంధనావళి) నిబంధనలు, 2021లను ప్రభుత్వం తీసుకువచ్చింది. రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తోందన్న కారణాలతో వీటిల్లో చివరిదానిపై ఇప్పటికే బాంబే, మద్రాసు హైకోర్టులు స్టే విధించాయి. వాస్తవానికి, ఐ.టి నిబంధనలు, 2021 మాదిరిగానే అలాంటి నిబంధనలనే తీసుకురావాలని బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసెస్ బిల్లు కూడా కోరుతోంది. ఈ చట్టాలు, నిబంధనలన్నీ కూడా ఒకే ఉమ్మడి అంశంతో రూపొందుతు న్నాయి. విస్తరిస్తున్న మీడియా, డిజిటల్ డేటాపై ప్రభుత్వ నియంత్రణను పెంచడం, అస్పష్టంగా నిర్వచించబడే ప్రాతిపదికలపై ప్రసారాలను నిలిపివేయడానికి లేదా శిక్షించడానికి నిరంకుశ అధికారాలను పెంచడమన్నది ఆ ఉమ్మడి అంశం సారాంశంగా వుంది. టెలివిజన్ చానెళ్ళు, చిత్రాల నుండి ఒటిటి వేదికలు, స్వతంత్ర యూ ట్యూబ్ చానెళ్ళ వరకు అన్ని రకాల మీడియాపై ప్రభుత్వ అదుపు, నియంత్రణను విస్తరించేందుకు సెన్సార్‌షిప్‌ను అందించే నిబంధనావళిని బ్రాడ్‌కాస్టింగ్ బిల్లు అందిస్తోంది. నియంత్రణా నిబంధనలను క్రమబద్ధీకరిస్తూ, హేతుబద్ధం చేసే పేరుతో అన్ని రకాల ప్రసారాలపై–అది టి.వి లేదా ఇంటర్‌నెట్ ఏదైనా కానీ, నిరంకుశ నియంత్రణా అధికారాల కోసం, శిక్షలు విధించడానికి ప్రభుత్వానికి వెసులుబాటు కల్పించారు.

వాట్సాప్, టెలిగ్రామ్, సిగల్ మెసేజింగ్ సర్వీసెస్ వంటి సామాజిక మాధ్యమాల వేదికలను కూడా కలుపుకునేందుకు సెన్సార్‌షిప్ సరిహద్దులను విస్తరించేందుకు కూడా ఈ బిల్లు ప్రాతిపదిక కల్పిస్తోంది. బిల్లులో అందచేసిన నిర్వచనాలను ఒకసారి పరిశీలించినట్లైతే ఈ బిల్లు ఉద్దేశ్యపూర్వక నిరంకుశ స్వభావం బహిర్గతమవుతున్నది. ఉదాహరణకు, ఏదైనా ఆడియో, విజువల్ లేదా ఆడియో–విజువల్ సమాచారం, సైన్, సిగల్స్, రాతలు, చిత్రాలు బ్రాడ్‌కాస్టింగ్ నెట్‌వర్క్‌ను ఉపయోగించి ప్రసారమైతే వాటిని 'కార్యక్రమాలు'గా సెక్షన్ 1(డిడి) నిర్వచిస్తోంది. వార్తలైనా, కరెంట్ అఫైర్స్ కార్యక్రమమైనా వాటిమీద కూడా దృష్టి సారిస్తారు. అవి కూడా నిబంధనావళికి కట్టుబడి వుండాల్సిందే. స్మార్ట్‌ఫోన్‌పై సందేశాలు లేదా కార్టూన్‌లు పంపేవారితో సహా అన్ని ఇంటర్‌నెట్, మీడియా వినియోగదారులు ఇందుకు బాధ్యులవుతారు. స్వతంత్ర యూ ట్యూబ్ జర్నలిస్టులు, వార్తా విశ్లేషకులు, డిజిటల్ వార్తా వెబ్‌సైట్‌లన్నింటికి వ్యతిరేకంగా పనిచేయడానికి ఈ బిల్లు ఒక సాధనంగా మారుతుంది. సైట్‌లు, యూ ట్యూబ్ చానెళ్ళను సబ్‌స్క్రైబ్ చేసుకునేవారిపై కూడా

నిఘా వుంటుంది. సోషల్ మీడియా మధ్యవర్తుల నిర్వచనాలు దాదాపు ఐ.టి రూల్స్‌లో వాటిలాగే వున్నాయి. అన్ని బ్రాడ్‌కాస్టర్లు కూడా తమ సబ్‌స్క్రైబర్ల డేటాను క్రమం తప్పకుండా ప్రభుత్వానికి అందచేయాల్సిన అవసరం వుంది. ఆ రకంగా వారందరి గోప్యత గాలికి ఎగిరిపోయినట్లే. సమాచార సమీక్షా కమిటీ (కంటెంట్ ఎవాల్యుయేషన్ కమిటీ–సిఇసి)తో సమాచారాన్ని ముందుగా సర్టిఫై చేయించుకోవాలని బిల్లు కోరుతోంది. ఈ కమిటీలో ఎంతమంది సభ్యులుంటారు, ఎంతమంది వుంటే కోరం అనేది ప్రభుత్వం నిర్ధారిస్తుంది.

ఈ చట్టం ఉల్లంఘించబడుతోందని ఆథరైజ్డ్ (అధికారం పొందిన) అధికారి ఎవరైనా విశ్వసిస్తే వెంటనే సంబంధిత పరికరాలను స్వాధీనం చేసుకుని, జప్తు చేసుకోవచ్చని బిల్లు పేర్కొంటోంది. అలాగే, దేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను, భద్రతను పరిరక్షించేందుకు, ఇతర దేశాలతో స్నేహ సంబంధాలు కాపాడేందుకు, శాంతి భద్రతలు, పరువు మర్యాదలు, నైతికత వంటి వాటిని కాపాడేందుకు ఏ కార్యక్రమం ప్రసారాన్నైనా ఆథరైజ్డ్ అధికారి నిషేధించవచ్చు. ఈ అస్పష్టమైన, ముసుగు కప్పిన అధికారాలతో అడ్డూ అదుపు లేని ప్రభుత్వ సెన్సార్‌షిప్ అమలవుతుంది. అన్నింటికంటే మిన్నగా, కార్యక్రమ నిబంధనావళి, వాణిజ్య నిబంధనావళి ఉల్లంఘనలపై వచ్చిన ఫిర్యాదులను విచారించేందుకు, కేంద్ర ప్రభుత్వానికి సలహా ఇచ్చేందుకు బ్రాడ్‌కాస్టింగ్ అడ్వైజరీ కౌన్సిల్ (బిఎసి)ని ఏర్పాటు చేయాలని ఈ బిల్లు పేర్కొంటోంది. ఈ కౌన్సిల్‌లో అందరూ ప్రభుత్వం నియ మించిన వారే వుంటారు. ఈ ఉన్నత సంస్థ స్వతంత్రంగా పరిశీలన చేస్తుందా, స్వతంత్ర తీర్పు ఇస్తుందా లేదా అన్నది సందేహాస్ప దంగా వుంది. పైన పేర్కొన్న రెండు నిబంధనావళులకు అనుగుణంగా లేవని భావించినట్లైతే ఏ కార్యక్రమాన్నయినా కేంద్ర ప్రభుత్వం నియంత్రించవచ్చు లేదా ప్రసారానికి నిషేధించవచ్చని బిల్లు పేర్కొంటోంది. ప్రస్తుతం ఈ నిబంధనావళుల వివరాలు స్పష్టంగా లేవు. భావ ప్రకటనా స్వేచ్ఛకు, భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణకు అతి పెద్ద ముప్పుల్లో ఒకటి కార్పొరేట్ల చేతుల్లో మీడియా కేంద్రీకృతమై పోవడం. ఒకపక్క దీనికి సంబంధించి పూర్తిగా మౌనం పాటిస్తూనే, తమకు ముప్పుగా పరిణమించే సమాచారాన్ని అడ్డుకోవడానికి మాత్రమే ఈ మొత్తం ప్రక్రియ అంతా ఉద్దేశించబడిందనడంలో ఎలాంటి ఆశ్చర్యం లేదు.

ఇతర చట్టాల విషయంలో జరిగిన విధంగానే, ఈ ముసాయిదా బిల్లుకు కూడా నిపుణులు, సంబంధిత పక్షాలు, ప్రజలు పంపించే వ్యాఖ్యలను, అభిప్రాయాలను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసే అవకాశం వుంది. బిల్లును చట్టంగా మార్చేందుకు అవసరమైన క్రమాన్ని మొదలు పెడతారు. దీని రాజ్యాంగ చెల్లుబాటును కోర్టుల్లో సవాలు చేయడానికి, ఫలితంగా వాటిపై ఆంక్షలు విధించడం లేదా మొత్తంగా రద్దు చేసేందుకు దారి తీసే అవకాశాలు కూడా లేకపోలేదు.

నిపుణుల, సామాన్య వినియోగదారుల అభిప్రాయాలకు చెవి ఒగ్గి, రాజ్యాంగ సూత్రాలు, నిబంధనలకు కట్టుబడి ఈ బిల్లును మోడీ ప్రభుత్వం ఉపసంహరించుకుంటే మంచిది. భిన్నమైన అభిప్రాయాలు, ఆలోచనలు ప్రజాస్వామ్యంలో కీలకమని ఆమోదించడం అవసరం. అయితే, అసమ్మతి వాణి, వైవిధ్యమైన అభిప్రాయాల వల్ల రాజకీయాధికారంపై అది కూడా కొద్ది నెలల వ్యవధిలో సార్వత్రిక ఎన్నికలు వున్న తరుణంలో తనకు గల పట్టు తుడిచిపెట్టుకు పోగలదని పాలక బిజెపి, మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం ఆందోళన చెందుతున్నట్లుగా కనిపిస్తోంది. అందువల్లే, బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసెస్ బిల్లు వంటి చట్టాలను తీసుకురావడానికే మొగ్గు చూపుతోంది. ప్రస్తుతమున్న చట్టాలను ఉపయోగించి కూడా స్వతంత్ర మీడియా సంస్థల్లో, కంటెంట్ క్రియేటర్లల్లో ఒక రకమైన భయాందోళనలను ఈ ప్రభుత్వం సృష్టిస్తోంది. అనేకమంది జర్నలిస్టులను జైళ్ళలో పెడుతోంది. తప్పుడు కేసులు బనాయిస్తోంది. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే వారి కంటెంట్‌ను ప్రచురించకుండా లేదా ప్రసారం కానివ్వకుండా అడ్డుకుంటోంది. ఈ పాలకపార్టీ దాని హంగుదారులైన సంఘపరివార్ అనుబంధ సంఘాలు%ేౌ%సత్యం కోసం పోరాడే నిరసనకారుల గొంతులు నొక్కేందుకు వీధిగూండాలుగా, ట్రోలర్లుగా విరుచుకు పడుతున్నాయి. ఈ నిగూఢ శక్తుల విలయ విహారం నేపథ్యంలో చూస్తే నిరసనను, ధిక్కారాన్ని పీక నులిమే క్రూర ప్రయత్నమే ప్రసారబిల్లని స్పష్టమవుతుంది. భారతదేశంలో ప్రజాస్వామ్యం పరిరక్షించబడాలంటే అన్ని ప్రజాతంత్ర శక్తులు ఏకమై కలిసికట్టుగా దీనిపై పోరాడాలి.

( 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం )

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల భూసేకరణ ప్రక్రియ వేగవంతం

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల భూసేకరణకు అవసరమైన బడ్జెట్ రెండు, మూడు రోజుల్లో విడుదల చేయనున్నట్లు సీసీఎల్ఏ అధికారులు వెల్లడించారని సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ శ్రీ. తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సీఎం క్యాంపు కార్యాలయంలో కలెక్టర్లతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్ లో ఇళ్ల స్థలాలకు సంబంధించిన భూసేకరణ చేసేటప్పుడు జర్నలిస్టుల అభిప్రాయాలను తప్పనిసరిగా పరిగణలోకి తీసుకోవాలని సూచించినట్లు వివరించారు. జర్నలిస్టులకు అనువైన ఇళ్లస్థలాలను అందించేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు. జర్నలిస్టుల ఇళ్లస్థలాల భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్లకు ముఖ్యమంత్రి కార్యదర్శి శ్రీ. రేవు ముత్యాలరాజు ఆదేశాలు జారీ చేసినట్లు కమిషనర్ పేర్కొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను కమిషనర్ విజయ్ కుమార్ రెడ్డి వివరిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన జర్నలిస్టులకు కేటాయించే ఇళ్లస్థలాల కోసం 23 నవంబర్, 2023న ప్రారంభమైన ఆన్ లైన్ పోర్టల్ ద్వారా రాష్ట్రంలో వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తూ అక్రిడిటేషన్ కార్డు కలిగిన అర్హులైన జర్నలిస్టులకు హౌసింగ్ స్కీమ్ క్రింద ఇంటి స్థలాలను అందించేందుకు ఇప్పటికే ప్రభుత్వం జీవో నంబర్ 535 జారీ చేసిందని గుర్తుచేశారు. ఈ క్రమంలో గడువు తేదీ 6 జనవరి, 2024 నాటికి జర్నలిస్టుల నుండి 10,017 దరఖాస్తులు అందాయని తెలిపారు. జీవోలోని నిబంధనల మేరకు అక్రిడిటేషన్ కార్డు పొందిన జర్నలిస్టుల వివరాలను, జర్నలిస్ట్‌గా వారి వృత్తి అనుభవాన్ని సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు పరిశీలించిన అనంతరం ప్రాథమికంగా ధృవీకరించి 7,651 మంది అర్హులైన జర్నలిస్టుల జాబితాను తదుపరి వెరిఫికేషన్ కోసం 26 జిల్లాల కలెక్టర్లకు పంపించడం జరిగిందన్నారు.

అసంపూర్తిగా ఉన్న 766 మంది జర్నలిస్టుల దరఖాస్తులను సరిదిద్దుకునేందుకు వారికి మరో అవకాశం కల్పించామని కమిషనర్ తెలిపారు. ఈ విషయమై ఇప్పటికే సంబంధిత జర్నలిస్టులకు సందేశాలు పంపడం జరిగిందని వెల్లడించారు. వివరాలు సరిచేసుకున్న అనంతరం సదరు జర్నలిస్టుల దరఖాస్తులను వెరిఫై చేసి కలెక్టర్లకు పంపిస్తామని పేర్కొన్నారు. గడువు తేదీ ముగుస్తున్న నేపథ్యంలో జనవరి 5 ,6 తేదీల్లోనే దాదాపు 1,626 మంది జర్నలిస్టులు దరఖాస్తు చేసుకోగా, 1600 మంది జర్నలిస్టుల దరఖాస్తులు మాత్రమే ప్రాథమిక ధృవీకరణ కోసం పెండింగ్ లో ఉన్నాయని, వాటి వెరిఫికేషన్ ప్రక్రియను రేపటిలోగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

అర్హులైన జర్నలిస్టులందరికీ సంతృప్తస్థాయిలో ఇళ్ల స్థలం కేటాయించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

**జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ఆన్ లైన్ దరఖాస్తు ప్రక్రియ గడువు పెంపు**

వివిధ కారణాలతో ఇళ్లస్థలాలకు దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకునేందుకు మరో వారం రోజుల గడువు కేటాయిస్తున్నట్లు సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ శ్రీ. తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి (19 ఫిబ్రవరి, 2024) నుండి 26 ఫిబ్రవరి, 2024 (సోమవారం) వరకు అర్హులైన జర్నలిస్టుల నుండి వెబ్ సైట్ లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఇప్పటికే 6 జనవరి, 2024 వరకు అంటే నిర్ణీత గడువులోగా ఆన్ లైన్ లో తమ వివరాలను నమోదు చేసుకోని వారికి మరియు నమోదు చేసుకున్నప్పటికీ సబ్మిట్ కొట్టని వారికి ఆయా జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల విజ్ఞప్తి మేరకు ఈ అవకాశం కల్పించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తూ అక్రిడిటేషన్ కార్డు కలిగిన అర్హులైన జర్నలిస్టులకు హౌసింగ్ స్కీమ్ క్రింద ఇంటి స్థలాలను అందించేందుకు ఇప్పటికే ప్రభుత్వం జీవో నంబర్ 535ను జారీ చేసిందని గుర్తుచేశారు. సంబంధిత జీవోలో పేర్కొన్న నిబంధనలకు అనుగుణంగా వివిధ కారణాలతో దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులు



# కేంద్రానికి లొంగిన జాతీయ మీడియా

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి జాతీయ కార్పోరేట్ మీడియా సంస్థలు దాసోహం అంటున్నాయని ప్రముఖ జర్నలిస్టు రామన్ మెగాసేసే అవార్డు గ్రహీత పాలగోమ్మి సాయినాథ్ అన్నారు. గుంటూరులోని కొరటాల భవన్‌లో అంబేద్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నార్ల వెంకటేశ్వరరావు పురస్కారాన్ని పాలగుమ్మి సాయినాథ్‌కు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఫౌండేషన్ అధ్యక్షులు బి విల్సన్ అధ్యక్షత వహించారు. సాయినాథ్ మాట్లాడుతూ వివిధ కారణాలతో మీడియా సంస్థలు మోడీ సర్కారుకు లొంగిపోవడంతో ప్రజా సమస్యలు వెలుగులోకి రావడం లేదని అన్నారు. ఢిల్లీలో రైతులు చేస్తున్న ఉద్యమానికి జాతీయ మీడియా ఇస్తున్న కవరేజే దానికి నిదర్శనం అన్నారు. ఒక్క జాతీయ మీడియా పత్రికలో కూడా కనీసం ప్రభుత్వ తీరును ఎండగడుతూ ఎడిటోరియల్ రాలేదని అన్నారు. రైతులపై కేంద్ర బలగాలు కనీవినీ ఎరుగని రీతిలో దాడులకు పాల్పడుతున్నాయని ధ్వజమెత్తారు. అన్నదాతలపై ప్రభుత్వం డ్రోన్లు వైమానిక దాడులు చేయడం అత్యంత పాశవికమని తెలిపారు. ఇతర దేశాల టెర్రరిస్టులపై ప్రయోగించాల్సిన డ్రోన్లు వైమానిక దాడులు మన దేశ రైతులపై ప్రయోగిస్తున్నారని అయినా కార్పొరేట్ మీడియా సంస్థలు పట్టించుకోవడం లేదన్నారు. ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం పాశవికమైన దమనకాండకు పాల్పడుతుందని హర్యానా పంజాబ్ ప్రభుత్వాలతో పాటు కేంద్ర ప్రభుత్వం రైతుల పట్ల వ్యవహరిస్తున్న తీరు సరికాదన్నారు. దేశంలో పత్రిక వ్యవస్థ అంబానీ గుప్పిట్లోకి వెళ్లిపోయిందన్నారు. ప్రస్తుత కేంద్ర పాలకులు సమాజాన్ని మత కుల పరంగా విభజిస్తున్నారని విమర్శించారు. సుప్రీంకోర్టులో చాలా కాలం తర్వాత మంచి తీర్పు వచ్చిందంటూ ఎలక్టోరల్ బాండ్ల రద్దు తీర్పును ప్రస్తావించారు. అయితే తీర్పులో తీవ్ర జాప్యం జరిగిందన్నారు. ప్రతిపక్షాలకు ఎవరి నుంచి విరాళాలు అందకుండా కట్టడి చేయడంలో భాగంగానే ఎలక్టోరల్ బాండ్లను మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిందని విమర్శించారు. ఈ పరిస్థితి వల్ల ప్రజలకు వ్యవస్థలపై నమ్మకం సన్నగిల్లే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కరోనా సమయంలో కేంద్రం కోర్టుల్లో అనేక తప్పుడు అఫిడవిట్లు దాఖలు చేసిందని అన్నారు. కరోనా వల్ల 2022 మార్చి నాటికి 5.22 లక్షల మంది చనిపోయారని మోడీ ప్రకటించగా అందుకు పదిరెట్లు ఎక్కువ మరణాలు సంభవించాయని అంతర్జాతీయ [illegible]

# భూసేకరణ ప్రక్రియ వేగవంతం

ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకోకుండా మిగిలిపోయి ఉంటే వారంతా %ఱఱఱ.అజూతీ.ఖజూ.స్రశీజ.అఱ% వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని 26 ఫిబ్రవరి, 2024 వరకు నిర్ణీత గడువులోగా తమ వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేసుకోవాలని సూచించారు. తద్వారా ప్రభుత్వం అందించే ఇళ్ల స్థలాలను ప్రతి ఒక్క జర్నలిస్టు పొందాలని తెలిపారు. ప్రస్తుతం దరఖాస్తు చేసుకునే జర్నలిస్టుల దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

అర్హులైన జర్నలిస్టులందరికీ సంతృప్తస్థాయిలో ఇళ్ల స్థలం కేటాయించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# జర్నలిస్టుల ఇంటి సమస్యలపై ఏపీడబ్ల్యూజేఎఫ్ ధర్నా

## దరఖాస్తు చేసిన ప్రతి జర్నలిస్టుకు స్థలం

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన

జిల్లాలో జర్నలిస్ట్ హౌసింగ్ స్కీం కింద అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టులు దరఖాస్తు చేసుకున్న ప్రతి జర్నలిస్ట్ కు 3 సెంట్ల ఇంటి స్థలాన్ని కచ్చితంగా కేటాయిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన హామీ ఇచ్చారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్ట్ హౌసింగ్ స్కీం లో జర్నలిస్టుల భార్యల పేర్లపై ఇంటి పట్టా అందని,వంశపారంపర్యంగా సంక్రమించిన భూమి ఉందని,కార్లు ఉన్నాయని తదితర కారణాలతో జిల్లాలో 92 దరఖాస్తులు తిరస్కరణ చేయడం పై బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఏపీడబ్ల్యూజేఎఫ్ నగర నాయకులు నజీర్ బాషా,బ్రహ్మయ్య అధ్యక్షత న ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్ నాగేంద్ర,జిల్లా నాయకులు ఎం. యు వినయ్ కుమార్ మాట్లాడుతూ దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలాన్ని ఇవ్వాలని రకరకాల కారణాలు లేకుండా ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపు లేవుట్ వేసి పట్టాల పంపిణీ చేపట్టాలని డిమాండ్ చేశారు. తిరస్కరణ అయిన 92 మంది జర్నలిస్టుల దరఖాస్తులు పరిశీలించి అందరికి పట్టాలు ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసుకున్న పట్టాలు ఇవ్వలేదని ఈ ప్రభుత్వంలో అయిన జర్నలిస్టుల హౌసింగ్ కల నెరవేర్చాలని అందుకు అనుగుణంగా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకుని రెవెన్యూ అధికారులను ఆదేశించాలని కోరారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ చేస్తున్న ధర్నా కార్యక్రమం దగ్గరకు సమాచార శాఖ డి.డి జయమ్మ సందర్శించి ఆమె మాట్లాడుతూ జర్నలిస్టుల డిమాండ్లు,అన్ని సమస్యలను జిల్లా కలెక్టర్ గారు పరిశీలించారని మీరు కోరిన విదంగా అక్రిడేషన్ కలిగి దరఖాస్తు చేసిన ప్రతీ ఒక్కరికి స్థలాన్ని అందించేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన కు ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులువినతిని అందించారు. కలెక్టర్ డాక్టర్ జి. సృజన మాట్లాడుతూ కార్లు, పొలాలు, కొనుక్కున్న స్థలాలు ఇలాంటివి ఉన్న అందరికి ఈ హౌసింగ్ స్కీం లో స్థలాన్ని అందించేలా చర్యలు తీసుకుంటామని, జి.ఓ ప్రకారం అమలు జరుగుతుందని,మీ భాగస్వామ్యం తో అమౌంట్ కట్టి తీసుకునే పట్టా ఇది ,జర్నలిస్ట్ వృత్తి రీత్యా పొందిన స్థలం పొంది ఉంటే తప్ప ప్రతి ఒక్కరికి ఇంటి స్థలాన్ని త్వరగా అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీనిపై ఎలాంటి సమస్యలు ఉన్నా సమాచార శాఖ డి.డి ని కలిసి మీ సమస్యలు తెలిపిన పరిష్కరిస్తారని స్థలాన్ని కూడా రెండు మూడు రోజుల్లో పరిశీలించి పట్టాలు అందించేలా చర్యలు తీసుకుంటామని జిల్లాలో ఎమ్మార్వో లకు ఆదేశాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు సుజాత, మధు, చెన్నయ్య, రమేష్, రవి, మస్తాన్, మధు, దామోదర్ సురేష్, మాలిక్ ,రాజు, లోకేష్,రామకృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

# మీడియాపై పోలీసులు దౌర్జన్యానికి ఏపీడబ్ల్యూజేఎఫ్ ఖండన

విజయవాడ ధర్నా చౌక్ లో అంగన్వాడి వర్కర్స్ పై పోలీసులు దౌర్జన్యంగా విరుచుకుపడి అరెస్టు చేస్తున్న సందర్భంగా వార్తల కవరేజ్ కి వెళ్ళిన విలేకరులు ఫోటోగ్రాఫర్లపై విజయవాడ డిసిపి విశాల్ గున్ని నాయకత్వంలో పోలీసులు పెద్ద ఎత్తున దౌర్జన్యానికి పాల్పడడం పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్. వెంకట్రావు, జి. ఆంజనేయులు తీవ్రంగా ఖండించారు. విజయవాడ చరిత్రలోనే విలేకరులపై ఇంత పెద్ద ఎత్తున పోలీసులు దౌర్జన్యానికి పాల్పడడం ఇటీవల కాలంలో ఇదే మొదటిసారి. ఫోటోగ్రాఫర్లను పోలీస్ వ్యాన్లెక్కించి అరెస్టు చేసి తీసుకుపోబోయారు. దాన్ని ఫోటోగ్రాఫర్లు ప్రతిఘటించడంతో వారిని విడిచిపెట్టారు. ప్రజాశక్తి ఫోటోగ్రాఫర్ రామును అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. మరో ప్రజాశక్తి ఫోటోగ్రాఫర్ రమణపై దౌర్జన్యంగా వ్యవహరించారు. మేము మీడియా ఫోటో తీస్తున్నాం సార్, వార్తలు కవరేజ్ కి వచ్చామంటే మీడియా అయితే ఏమిటి అంటూ డిసిపి విశాల్ గున్ని నిర్లక్ష్యంగా మాట్లాడారు. ఆయన కింది పోలీస్ అధికారులు మరింత రెచ్చిపోయి మీడియాపై దౌర్జన్య వ్యవహరించారు. పోలీసుల తీరును ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది మీడియాపై దౌర్జన్యానికి పాల్పడిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నది.

# విశాఖలో ఫెడరేషన్ డైరీ ఆవిష్కరణ



సమాజం కోసం నిరంతరం పాటుపడే జర్నలిస్టులతోనే నవ సమాజ ప్రగతి సాధ్యమని జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి కొనియాడారు. ఫిబ్రవరి 12న మేయర్ ఛాంబర్‌లో ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ వర్కింగ్ జర్నలిస్టుల డైరీని హరి వెంకట కుమారి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ప్రతి ఏటా వర్కింగ్ జర్నలిస్టుల కోసం రాష్ట్ర కార్యవర్గం ప్రత్యేకంగా డైరీ రూపొందించి అన్ని జిల్లాల ప్రతినిధులకు వంపించడం ఎంతో అభినందనీయమన్నారు. జర్నలిస్టుల సహకారంతోనే జీవీఎంసీ అనూహ్య ప్రగతి సాధించిందన్నారు. వారి వల్లే తాను కూడా మేయర్‌గా తగిన గుర్తింపు పొందగలిగాను అన్నారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ అర్బన్ అధ్యక్షుడు పి. నారాయణ్ మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమానికి తమ అసోసియేషన్లు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయన్నారు. తాము కూడా తమ పరిది మేరకు జర్నలిస్టులకు అండగా ఉంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రకార్యవర్గ సభ్యులు జి. శ్రీనివాసరావు, బ్రాడ్ కాస్ట్ జిల్లా అధ్యక్షుడు ఇరోతి ఈశ్వరరావు, ఇతర ప్రతినిధులు టి. కృష్ణమూర్తినాయుడు, శ్రీనివాస్ నాయుడు పాల్గొన్నారు.

---

# హేలాపురి న్యూస్ విలేకరిపై దాడి

ద్వారకా తిరుమల హేలాపురి న్యూస్ రిపోర్టర్ శ్రీనివాసరావు పై దాడి జరిగింది. ఒక ప్రముఖ దినపత్రిక విలేకరిగా పనిచేస్తున్న వ్యక్తి కొంతమంది వ్యక్తులు కలిసి ఈ దాడి చేశారు. ఈ దాడి హేయమైన చర్య అని ఏలూరుజిల్లా ఏ పి డబ్ల్యూ జె ఎఫ్ కమిటీ ఖండించింది. ఏలూరులో ఏ పి డబ్ల్యూ జె ఎఫ్ జిల్లా కమిటీ శ్రీనివాసరావు పై జరిగిన దాడి పై అత్యవసర సమావేశం నిర్వహించింది. ద్వారకా తిరుమలలో జరిగే కొన్ని అక్రమాలపై వార్తలు రాస్తున్నాడని హేలాపురి న్యూస్ రిపోర్టర్ శ్రీనివాసరావు పై కొద్దీ రోజులుగా రెక్కీ నిర్వహించి దాడి చేశారని కమిటీ అభిప్రాయం పడింది. శ్రీనివాసరావు ఆధారాలు లేని వార్తలు రాసుంటే ఆయనపై ఆయన పని చేసే పత్రిక ఎడిటర్‌కి .లేదా ఫెడరేషన్ దృష్టికి తీసుకురావాలి తప్ప చట్టవ్యతిరేకంగా దాడులకు పాల్పడడం ఎంతమాత్రం సరైనచర్య కాదని ఫెడరేషన్ అభిప్రాయపడింది. పట్ట పగలు మారణాయుధసలతో దాడికి పాల్పడటం చూస్తుంటే ఎంతటి దుర్మార్గానికైనా దిగాలని భావించినట్లు అర్ధమవుతున్నదన్నారు. ఇటువంటి ధోరణి ఎంతమాత్రం మీడియాకు మంచిది కాదని ఈ విషయాన్ని గుర్తించి తోటి జర్నలిస్టులు వ్యవహరించాలని కోరుతూ దాడికి పాల్పడిన వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరింది. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ఏ పి డబ్ల్యూ జె ఎఫ్ ఏలూరు జిల్లా కమిటీ అధ్యక్ష కార్యదర్శి ఎస్ డి జబీర్. హరీష్. సీనియర్స్ బాలసౌరి , శంకర్రావు రుషి. వెంకట్రావు. సోమశేఖర్. బి విజయకుమార్ కోరారు. ఏలూరు జిల్లా ఫెడరేషన్ కమిటీ సమావేశమై ఈ అంశంపై జిల్లా పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి విషయం తీసువెళ్ళాలని నిర్ణయించింది. శ్రీనివాస్ హేలాపురి న్యూస్ విలేకరిగా పనిచేయడంతో పాటు ఫెడరేషన్ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా తిరుపతిలో జరిగిన ఫెడరేషన్ మహాసభలో ఎన్నికయ్యారు. ఆయనపై జరిగిన దాడిని జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించి బాధ్యులను అరెస్టు చేయాలని కోరింది.

# దాడులపై ఏలూరులో ఫెడరేషన్ నిరసన

చింతలపూడి లో నిన్న జరిగిన తెలుగుదేశం పార్టీ బహిరంగ సభ న్యూస్ కవరేజ్ కి వెళ్ళిన ఫెడరేషన్ సీనియర్ నాయకులు, ఆంధ్రప్రభ స్టాఫ్ రిపోర్టర్ శంకర్రావు, సీనియర్ జర్నలిస్టు (వార్త) రమణ రావులను మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అనుచితంగా ప్రవర్తించి, వారి వద్ద నుండి ఫోన్ లాక్కొని దుష్ప్రాప్తలాడిన వైకిరిని మూడో తేదీన జరిగిన సిద్ధం సభలో కూడా జర్నలిస్టులపై అనుచితంగా ప్రవర్తించినందుకు నిరసిస్తూ ఏలూరులో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం అనంతరం జిల్లా ఏ ఎస్పీకి వినతి పత్రం ఇవ్వటం జరిగింది. అనంతరం ఎపిడబ్ల్యుజెఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షులు ఎస్ డి జబీర్, ఫెడరేషన్ నాయకులు కె.బాలశౌరి, ప్రజాశక్తి స్టాఫ్ రిపోర్టర్ పి గంగరాజులు మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు హేయమైన చర్యఅని దీనిని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఏలూరు జిల్లా శాఖ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు.




భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని జర్నలిస్టులు ర్యాలీగా వెళ్లి ఏ ఎస్ పి కి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులపై దురుసుగా ప్రవర్తించిన మాజీ ఎమ్మెల్యే చింతమనేని చింతమనేని ప్రభాకర్‌పై చర్యలు తీసుకొని బలవంతంగా లాక్కున్న ఫోన్‌లను తిరిగి ఇప్పించవలసిందగా కోరటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వై వి హరీష్, ఉపాధ్యక్షులు కే సోమశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి విజయకుమార్, పశ్చిమ వాహిని ఎడిటర్ ఎస్ కే బాబ్జి, జర్నలిస్ట్ నాయకులు ఋషి రావు, మిల్టన్ ప్రతాప్, చదలవాడ ప్రతాప్, మ్యాచ్ సబ్జీ, కళ్యాణ్,శ్యామల రావు, సత్యనారాయణ, శ్రీనివాసరావు,సతీష్, మౌనిక విక్టర్బా,లిన్ ఎర్ర జైదాసు,జయరామ్, వెంకట్రావు,రాజు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి హామీ

క్షేత్రస్థాయిలో పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆర్డీఓ గౌరీ శంకరి హామీ ఇచ్చారు. నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ 2024 నూతన



సంవత్సర డైరీని ఆర్డీఓ గౌరీ శంకరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో గౌరీశంకరి మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా పాత్రికేయులకు నివేశన స్థలాల మంజూరు ఇతర సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తామన్నారు. పాత్రికేయులపై దూషణలు దాడుల సందర్భంగా దోషుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఏపీడబ్ల్యుజేయఫ్ కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పాత్రికేయులకు ఆర్డీఓకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నూజివీడు డివిజన్ కార్యదర్శి నీలావన వెంకటేశ్వర్లు, కోశాధికారి అబ్బా దాసరి వసంతరావు, అధ్యక్షుడు ఎంబీఏ ఆలీ సభ్యులు బ్రహ్మం, చంద్రపాటి బాబు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.




# జర్నలిస్టుల ఐక్యతతోనే హక్కుల సాధన

## ఏపీడబ్ల్యూజేఎఫ్ పాణ్యం నియోజకవర్గ కమిటీ ఎన్నిక

జర్నలిస్టులు ఐక్యతతో తమ హక్కులు సాధించుకోవడం సాధ్యమవుతుందని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గోరంట్లప్ప అన్నారు. ఓర్వకల్ మండలంలోని సీఎల్ ఆర్సీ భవనంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ పాణ్యం నియోజకవర్గ నూతన కమిటీ, ఓర్వకల్ మండల కమిటీ ఎన్నిక ఓర్వకల్ 10 టీవీ రిపోర్టర్ వీరాంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోరంట్లప్ప, కర్నూలు జిల్లా కన్వీనర్ నాగేంద్ర, నంద్యాల జిల్లా కన్వీనర్ మద్దయ్య యాదవ్, కో కన్వీనర్ శివకుమార్, నంద్యాల పట్టణ ప్రధాన కార్యదర్శి జగన్మోహన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్టంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జర్నలిస్టుల కోసం అనేక ఉద్యమాలు జర్నలిస్టుల హక్కుల కోసం పోరాటాలు చేస్తుందని జర్నలిస్టులు ఐక్యతతో హక్కులు సాధించుకోవాలన్నారు. అక్రిడేషన్ సాధించడం, హెల్త్ కార్డులు, ఇంటి స్థలాలు, సాధించడంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ఓర్వకల్, కల్లూరు మండలాలకు కలిపి పాణ్యం నియోజకవర్గ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవా ధ్యక్షులుగా రాజేంద్ర ఆంధ్రజ్యోతి, అధ్యక్షుడు వీరంజనేయులు 10 టీవీ కార్యదర్శిగా సుజాత సూర్య, కోశాధికారిగా మధు మెట్రో టివి , ఉ పాధ్యక్షులుగా ఏబీఎన్ శ్రీను, రఫిక్ బాషా వార్త,రాజేష్ హెచ్ ఏం టివి ,సహాయ కార్యదర్శులుగా పరమేష్ ,మౌలాలి స్వతంత్ర ఛానల్ , ఈసీ సభ్యులుగా మధు సూర్య, నాగరాజు సూర్య ,తదితరులను కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఓర్వకల్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఓర్వకల్ మండల గౌరవాధ్యక్షులు గా గోపాల్ సీవీఆర్ ,అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్ ఆంధ్రప్రభ,ప్రధాన కార్యదర్శి మౌలాలి స్వతంత్ర ఛానల్,ఉపాధ్యక్షుడు భాస్కర్ రావు సాక్షి,సహాయ కార్యదర్శి విరూపాక్షి యన్ టివి , రాజేష్ హెచ్ ఎం టివి ,కోశాధికారి వీరంజనేయులు 10టీవీ ,కమిటీ సభ్యులుగా బోయ రామకృష్ణ మనం, శ్రీనివాసులు ఎబియన్,యల్లా రామకృష్ణ అంఖండ భూమి, నాగరాజు సూర్య,మరికొందరిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గడివేముల,పాణ్యం,ఓర్వకల్,కల్లూరు మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు.

FORM IV
(Rule 8)

UNDER THE PRESS AND REGISTRATION OF BOOKS ACT,1867 STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS ABOUT PERIODICAL WORKING JOURNALIST SAMACHAR SRAVANTHI

1. Place of Publication : Hyderabad
2. Periodicity of its Publication : Monthly
3. Printer's Name : G.Anjaneyulu on behalf of Andhra Pradesh Working Journalists' Federation
   (a) Whether a citizen of India : YES
   (b) if a foreigner, the country of origin :

Address : 402, Surabhi Sapphire, olconda 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020

4. Publisher's Name : G.Anjaneyulu on behalf of Andhra Pradesh Working Journalists' Federation
   (a) Whether a citizen of India : YES
   (b) if a foreigner, the country of origin :

Address : 402, Surabhi Sapphire, Golconda 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020

5. Editor's Name : G.Anjaneyulu
   Nationality : INDIAN
   (a) Whether a citizen of India : YES
   (b) if a foreigner, the country of origin :

Address : H.No.12-2-831/53,F-201,MIGH59, Venkat Homes, Mehidipatnam, Hyderabad - 500 028

6. Name and Addresses of individuals who own the Newspaper and partners or shareholders holding more than one percent of the total capital: ANDHRA PRADESH WORKING JOURNALISTS' FEDERATION

I, G.Anjaneyulu on behalf of Andhra Pradesh Working Journalsits' Fed eration, here by declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date: 29-02-2024 Sd/- G.Anjaneyulu

# కలెక్టర్‌ను కలిసిన ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా బృందం

## ఇళ్ల స్థలాల కోసం కలెక్టర్‌కు వినతి


అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయింపు చేయాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాతాడ నవీన్ రాజ్, ముమ్మిడి లక్ష్మణ్ కాకినాడ జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లాను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా అధ్యక్షులు నవీన్ రాజు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ప్రతి జిల్లా కలెక్టర్లను కలిసి వినతి పత్రాలు అందించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అర్హత కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయింపు చేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు కాకినాడ జిల్లాలో ఎవరికి ఇళ్ల స్థలాలు కేటాయించలేదని కలెక్టర్‌కు తెలిపామన్నారు. జర్నలిస్టులందరూ ఇళ్ల స్థలాలు విషయంలో ఎంతో ఆశతో ఉన్నారని, జర్నలిస్టులకు ఇస్తామన్న షరతులు లేని ఇళ్ల స్థలాలు ఇచ్చి జగన్మోహన్ రెడ్డి మాట నిలబెట్టుకోవాలన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ వినతి పత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి పంపడం జరుగుతుందని కలెక్టర్ జిల్లా బృందానికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు గునిపే శోభన్ బాబు, సత్య, పురె త్రినాథ్, వాసంశెట్టి శ్రీనివాస్, శివరామకృష్ణ, శ్రీ హరి, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు ప్రచారాలపై పాత్రికేయ అస్త్రం

**కరణ్ థాపర్, సీనియర్ జర్నలిస్ట్**

ఉద్దేశపూర్వకమైన తప్పుడు ఆరోపణల వెనుక ఉన్న వాస్తవాలు ఇవీ అని వెల్లడించడం ఉత్తమమైన పాత్రికేయ విలువలకు ప్రామాణికం అవుతుంది. అటువంటి ఒక ప్రామాణిక గ్రంథమే సీనియర్ జర్నలిస్టులు రాసిన 'లవ్ జిహాద్ అండ్ అదర్ ఫిక్షన్స్: సింపుల్ ఫ్యాక్ట్స్ టు కౌంటర్ వైరల్ ఫాల్స్‌హుడ్స్'!

పుస్తకం పేరులో కనిపిస్తున్న 'అదర్ ఫిక్షన్స్' ఏమిటంటే... పాపులేషన్ జిహాద్,బలవంతపు మతమార్పిళ్లు, ముస్లింలను బుజ్జగించడం లాంటి అసత్య ప్రచారాలు. వాస్తవాల నిర్ధారణకు క్షేత్రస్థాయిలో నుండి,మీడియా వార్తల తవ్వకాల నుండి సంగ్రహించిన కచ్చితమైన పరిశోధనాంశాలతో హాస్యాస్పదమైన అభియోగాలను రచయితలు బట్టబయలు చేశారు. 2014 తర్వాత 'గో%--%సంబంధ దాడులు' ఎంత పెరిగాయో కూడా ఈ పుస్తకం చూపిస్తుంది.




ఒకవేళ మీకు కూడా నాలాగే భారతీయ పాత్రికేయ వృత్తి వైఖరులపై నిరాశ మొదలై ఉంటే, కనుచూపు మేరలో భూమ్యాకాశాలు కలిచేచోట ఒక శుభవార్త ఉందని తెలుసుకుని మీరెంతగానో సంతోషిస్తారు. అది టీవీ న్యూస్ ఛానెల్ కోసమో లేదా వార్తాపత్రిక కోసమో జరిగిన పనైతే కాదు. నిజానికి అదొక పుస్తకం. ఆ పుస్తకం అత్యున్నత పాత్రికేయ ప్రమాణాలను కలిగి వుండి, ఖ్యాతిని కోల్పోతున్న వృత్తిపై విశ్వాసాన్ని పాదుగొల్పే ఒక గణనీయ పునరుద్ధరణ. ఈ రోజు నేను ఆ పుస్తకం వైపు మీ దృష్టిని మరల్చాలని అనుకుంటున్నాను.

లవ్ జిహాద్ అండ్ అదర్ ఫిక్షన్స్: సింపుల్ ఫ్యాక్ట్స్ టు కౌంటర్ వైరల్ ఫాల్స్‌హుడ్స్' అనే ఆ పుస్తకాన్ని ఇద్దరు మాజీ ఎన్డీ టీవీ జర్నలిస్టులు శ్రీనివాసన్ జైన్, మరియమ్ అలావీబీ 'స్క్రోల్' ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ సుప్రియా శర్మ కలిసి రాశారు. పుస్తకం పేరులో కనిపిస్తున్న 'అదర్ ఫిక్షన్స్' ఏమిటంటే... పాపులేషన్ జిహాద్, బలవంతపు మతమార్పిళ్లు, ముస్లింలను బుజ్జగించడం, ఇంకా సోకాల్డ్... 'పింక్ రివల్యూషన్'.

ప్రతి కేసులోనూ మొదట ఈ పుస్తక రచయితలు ఉద్దేశ పూర్వకమైన తప్పుడు ఆరోపణల వెనుక ఉన్న వాస్తవాలు ఇవీ అని వెల్లడిస్తారు. ఆ తర్వాత వాస్తవాల నిర్ధారణకు క్షేత్రస్థాయిలో నుండి, మీడియా వార్తల తవ్వకాల నుండి సంగ్రహించిన కచ్చితమైన పరిశోధనాంశాలతో హాస్యాస్పదమైన ఆ అభియోగాలను బట్టబయలు చేస్తారు. లేదా ఆ ఆరోపణల్లోని అవాస్తవాలను ధ్వంసం చేస్తారు.

పుస్తకం గురించి నేను చెప్పవలసి ఉన్నదానిలో ఇంతకుమించి ఒక్కమాటైనా చెప్పకుండా నేను జాగ్రత్త పడాలనుకుంటున్నాను. మీకై మీరు చదవవలసిన అవసరం ఉన్న పుస్తకం ఇది. తనని చదివించు కునేలా చేస్తుంది. మిమ్మల్ని ఒప్పించేలా చదివిస్తుంది. అయినా గానీ, మీ ఆకలిని నన్ను కాస్త రెచ్చగొట్టనివ్వండి. లవ్ జిహాద్‌పై ఈ పుస్తక రచయితలు విశ్వ హిందూ పరిషత్ అంతర్గత పత్రిక ప్రత్యేక సంచిక ప్రచురించిన జాబితాలోని కేసులను విశ్లేషించారు. "లవ్ జిహాద్‌పై

అందుబాటులో ఉన్న ఏకైక సమగ్ర సాక్ష్యాధార సమాచారం అదొక్కటే''. అయితే నిజానికది, "147 వార్తా కథనాల క్రమానుగత కూర్పు మాత్రమే''. ఆ కూర్పులో మొదటి కేసు 2011 నవంబరు నాటిది, చివరి కేసు 2020 సెప్టెంబర్ లోనిది.

వాటిల్లో డెబ్బై మూడు, అంటే సగానికి సగం కేసులు 'వాస్తవాలకు నిలబడనివి'."అవన్నీ లింకులు తెగినవి, చెప్పిందే చెప్పినవి, భారతదేశానికి సంబంధం లేనివి''. తక్కిన డెబ్బై నాలుగు… "మోసం, అపహరణ, విడిచి పెట్టటం, అత్యాచారం,హత్య మొదలైన వాటితో సహా లింగ సంబంధ నేరాల విస్తృత సమాచారం. "అన్నిటి లోనూ ఉమ్మడిగా ఉన్నది ఒకటే. నిందితుడు ముస్లిం, బాధితురాలు హిందువు" అని రచయితలు పేర్కొన్నారు. లవ్ జిహాద్ లక్ష్యం హిందూ మహిళల్ని మాయచేసి, మభ్యపెట్టి మతం మార్చడమే అయితే ఈ ఉదాహరణలు కేసును బలహీన పరుస్తాయి

2014 తర్వాత "గో%--%సంబంధ దాడులు'' ఎంతలా విపరీతంగా పెరిగాయో కూడా ఈ పుస్తకం చూపిస్తుంది. "ఇంటర్నెట్‌లోని మీడియా ఆర్కైవ్స్‌ను ఉపయోగించి మేము రెండు కాలాల వ్యవధిలో… 2009 నుండి 2014 వరకు కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో, 2014లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి 2023 మే వరకు… జరిగిన గో%--%సంబంధ దాడుల సంఖ్యను లెక్కించాం" అని పుస్తక రచయితలు వెల్లడించారు.

నిజం ఏమిటో తెలిసిన కొద్దిమందికి ఆ లెక్కలు ఆశ్చర్యం కలిగించవు. తెలియని ఎక్కువమంది మాత్రం నమ్మలేనట్లు చూస్తారు. "2009%--%2014 మధ్య ఒకే ఒక గో%--%సంబంధ హింసాత్మక సంఘటనను మేము కనుగొన్నాము." ఆ కేసులో కూడా, ''దాడి వీహెచ్‌పీ నేతృత్వంలో జరిగింది''. అందుకు భిన్నంగా, "2014 నుంచి 2023 మే వరకు అలాంటి గో%--%సంబంధ దాడులు 136 వరకు జరిగినట్లు మా లెక్కల్లో తేలింది. ఆ దాడుల్లో 66 మంది మరణించారు. 284 మంది గాయపడ్డారు. హతులైన వాళ్లలో కనీసం 70 శాతం మంది ముస్లింలే" అని వారు వివరాలు పొందు పరిచారు

ద్వేషపూరిత ప్రసంగాల విస్తృతిపై ఈ రచయితలు బహిర్గత పరచిన వివరాలను కూడా మీకు చెబుతాను. "2009%--%2014 మధ్య కాంగ్రెస్ హయాంలో దాదాపుగా 25 వరకు అలాంటి ద్వేష ప్రసంగాలు మా లెక్కకు అందాయి. ఆ సంఖ్య బీజేపీ హయాంలో ప్రముఖ వ్యక్తులు చేసిన విద్వేష ప్రసంగాలతో కలిపి 460కి చేరుకుంది". అంటే తొమ్మిది రెట్ల దూకుడు! మీలో చాలామంది లవ్ జిహాద్, పాపులేషన్ జిహాద్, బలవంతపు మతమార్పిళ్ల వంటి అపోహల్ని నమ్మకపోవచ్చు.

ముస్లింల బుజ్జగింపు జరుగుతోందంటే మాత్రం బహుశా మీలో ఎక్కువమంది నమ్మే అవకాశమైతే ఉంది. అప్పుడైతే మీరు ఆ అంశానికి సంబంధించిన అధ్యాయాన్ని ఈ పుస్తకంలో తప్పనిసరిగా చదవాలి. అందులో రచయితలు ఈ బుజ్జగింపు అభియోగాన్ని అక్షరాలా తుడిచిపెట్టేశారు. ఎంత ప్రభావవంతంగా వారు ఆ పని చేశారన్నది కనిపెట్టే విషయాన్ని మీకే వదిలేస్తాను. కానీ వారిచ్చిన ముగింపులలో ఒకదాని గురించి చిన్న ముక్క చెబుతాను

హిందూ రైట్‌వింగ్ పొరబడింది. ముస్లింలు కాంగ్రెస్ బుజ్జగింపులకు దూరంగా ఎక్కడో అట్టడుగున ఉండిపోయారు. కాంగ్రెస్ దేనికైనా దోషిగా నిలబడిందీ అంటే… ఆ దోషం… అంత సుదీర్ఘంగా అధికారంలో ఉండి కూడా ముస్లింలను పైకి తేవటంలో విఫలం అవటమే" అని రచయితలు వ్యాఖ్యానించారు.

చిన్నపాటి ధార్మిక ఉపన్యాసంతో నేనిది ముగిస్తాను. సత్యాన్ని చూడకూడదని అనుకునేవారు, అంధులు గానే ఉండిపోయేందుకు ప్రాధాన్యం ఇచ్చేవారు ఈ పుస్తకం చదవకండి. ఎందుకంటే అది వారి నిరాధారమైన భ్రమల్ని పటాపంచలు చేస్తుంది. కానీ నిజం ఏమిటో తెలుసుకోగోరే యథార్థవాదులకు ఇది చదవవలసిన పుస్తకం. వాస్తవాలను సరళంగా, పూత పూయని పదాలతో తేలిగ్గా జీర్ణమయ్యేలా మీకు ఈ పుస్తకం చెబుతుంది. అంతే తేలిగ్గా మీరు పుస్తకం లోపలి విషయాలను అంగీకరించ గలుగుతారని నేను ఆశిస్తున్నాను.

**(సాక్షి దినపత్రిక నుండి సేకరణ)**



# వేమూరు నియోజకవర్గ ఫెడరేషన్ కార్యవర్గ ఎన్నిక

వేమూరు: అంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ వేమూరు నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. గుంటూరు జిల్లా తెనాలిలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కనపర్తి రత్నాకర్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. అధ్యక్షునిగా మేకల సుబ్బారావు(ఆంధ్ర ప్రభ), కార్యదర్శిగా పులివర్తి బుల్లయ్య (సాక్షి) ఉపాధ్యక్షునిగా కరేటి సాంబశివరావు ( ప్రజా ప్రవాహం) సహాయ కార్యదర్శులుగా దాసరి వెంకటేశ్వరరావు (ఉదయం) యల్లమాటి రామకృష్ణ బాపనయ్య (టి వి 11) లను ఏకగ్రీవంగా గా ఎన్నికయ్యారు. నూతన కమిటీని ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు ఆంజనేయులు, నాయకులు పున్నయ్య, జహీర్, సురేష్ బాబు, డి. కోటేశ్వరరావు, ఎ. సాంబ శివరావు, ప్రకాశరావు, చందు, ఎన్.ఎన్. వి శేఖర్ తదితరులు అభినందించారు.

---

# డిసిపి విశాల్ గున్ని పై చర్యలు తీసుకోవాలి

విజయవాడ ధర్నా చౌక్ లో అంగన్వాడి వర్కర్స్ పై అర్ధరాత్రి పోలీసులు దౌర్జన్యంగా విరుచుకుపడి అరెస్టు చేస్తున్న సందర్భంగా వార్తల కవరేజ్‌కి వెళ్ళిన విలేకరులు ఫోటోగ్రాఫర్లపై విజయవాడ డిసిపి విశాల్ గున్ని నాయకత్వంలో పోలీసులు పెద్ద ఎత్తున జర్నలిస్టులపై దౌర్జన్యానికి పాల్పడడం పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, జిల్లా కన్వీనర్ నాగేంద్ర ,ఖండించారు. విజయవాడ చరిత్రలోనే విలేకరులపై ఇంత పెద్ద ఎత్తున పోలీసులు దౌర్జన్యానికి పాల్పడడం ఇటీవల కాలంలో ఇదే మొదటిసారని ఫోటోగ్రాఫర్లను పోలీస్ వ్యాన్‌లలో ఎక్కించి అరెస్టు చేసి తీసుకెళ్లడం

## మీడియాపై పోలీసులు దౌర్జన్యాన్ని అరికట్టాలి

దుర్మార్గమైన చర్య అని జర్నలిస్టులకు ఉన్న హక్కులను సైతం కలరాస్తున్న పోలీస్ వారిపై చర్యలు తీసుకివాలని కోరారు. ఈ సంఘటనలో ఫోటోగ్రాఫర్లు ప్రతిఘటించడంతో వారిని విడిచిపెట్టారు. ప్రజాశక్తి ఫోటోగ్రాఫర్ రామును అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. మరో ప్రజాశక్తి ఫోటోగ్రాఫర్ రమణపై దౌర్జన్యంగా వ్యవహరించారు. మీడియా ఫోటో తీస్తున్నాం సార్, వార్తలు కవరేజ్‌కి వచ్చామంటే మీడియా అయితే ఏమిటి అంటూ డిసిపి విశాల్ గున్ని నిర్లక్ష్యంగా మాట్లాడారు దురుసుగా ప్రవర్తించారు. విశాల్ గున్ని పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు ఇతర పోలీస్ అధికారులు మరింత రెచ్చిపోయి మీడియాపై దౌర్జన్యంగా వ్యవహరించారు. పోలీసుల తీరును ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ,జిల్లా కమిటీలు,రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు తీవ్రంగా ఖండిస్తున్నారని మీడియాపై దౌర్జన్యానికి పాల్పడిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు.

# జర్నలిస్టులకు త్వరగా ఇళ్ల స్థలాలు

## కలెక్టర్ డిల్లీరావుకు ఎపిడబ్ల్యుజెఎఫ్ వినతి

జర్నలిస్టులకు మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావుకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ (ఎపిబిజెఎ) ఆధ్వర్యాన జర్నలిస్టులు విజ్ఞప్తి చేశారు. ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిబిజెఎ ఆధ్వర్యాన కలెక్టర్ డిల్లీరావును విజయవాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో సోమవారం జర్నలిస్టులు కలిశారు. జనవరి 6వ తేదీ వరకు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ వారు స్వీకరించిన దరఖాస్తుల్లో ఎన్‌టిఆర్ జిల్లాకు సంబంధించి 1277 దరఖాస్తులు అర్హమైనవిగా గుర్తించారని కలెక్టర్‌కు నేతలు వివరించారు. గత రెండు మూడు దశాబ్దాలుగా ఎన్‌టిఆర్ జిల్లాతోపాటు విజయవాడ నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లోని వేలాది మంది జర్నలిస్టులు ఇళ్ల స్థలాలకు నోచుకోలేదని పేర్కొన్నారు. గత రెండు మూడు దశాబ్దాల్లో వందలాది మంది జర్నలిస్టులు కొత్తగా ఈ రంగంలోకి వచ్చారని, రాష్ట్ర విభజన తర్వాత ఏర్పడిన రాష్ట్ర రాజధాని ప్రాంతంలో విధుల నిర్వహణకు కూడా వందలాది మంది ఇక్కడికి వచ్చారని పేర్కొన్నారు. ఎప్పటి నుండో స్థలాలకు నోచుకోకపోవడంతో ఇప్పటికే కొందరు సీనియర్ జర్నలిస్టులు ఇప్పటికే రిటైరయ్యారని, మరికొంత మంది రిటైరయ్యే దశలో ఉన్నారని కలెక్టర్‌కు విన్నవించారు. ఈనేపథ్యంలో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందన్న సమాచారంతో ఇళ్ల స్థలాల కేటాయింపులో జాప్యం జరిగే అవకాశం ఉందనే ఆందోళన జర్నలిస్టుల్లో రోజురోజుకూ పెరుగుతోందని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని జర్నలిస్టులకు త్వరగా ఇళ్ల స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, రాష్ట్ర నాయకులు షేక్ ఖాజావలి, నగర కార్యదర్శి ఎం.బి.నాథన్, ఎపిబిజెఎ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.వి.రంగారెడ్డి, ఫెడరేషన్ నగర నాయకులు వి.హెచ్.రాజు, పశ్చిమ సిటీ కార్యదర్శి వి.యు.ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# జోరుగా ఏపీడబ్ల్యూజేఎఫ్ సభ్యత్వ నమోదు

ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా సాగుతోంది. 2024 సంవత్సరానికి గాను సభ్యత్వ నమోదును ఇప్పటికే ప్రారంభించారు. కార్యక్రమంలో భీమిలి, తగరపువలస, ఆనందపురం ప్రాంతాలకు చెందిన జర్నలిస్టులు పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు. ఎన్ఏజె కార్యదర్శి గంట్ల శీనుబాబు, విశాఖ నగర శాఖ అధ్యక్షులు పి.నారాయణ్, జాతీయ కౌన్సిల్ సభ్యులు జి శ్రీనివాసరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రంగనాథంలు గుర్తింపు కార్డులు, వాహన స్టిక్కర్లను అందజేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కృషి ఫలితంగా జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ ఉత్తర్వులిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. ఇప్పటికే అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్, హెల్త్ కార్డులు అందజేసినట్లు పేర్కొన్నారు. ఇంకా మిగిలిపోయిన వారందరికీ ఆయా ప్రయోజనాలు సాధించేందుకు ఫెడరేషన్ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.

# జర్నలిస్టులపై ఆదానీ 'పెగాసెస్!

–రాఘవ శర్మ

స్టాక్ మార్కెట్లో ఆదాని గ్రూపు తన కంపెనీ విలువలను తారుమారు చేసిందని అమెరికాకు చెందిన హిండెన్ బర్గ్ ఆరోపించింది. కార్పొరేట్ చరిత్రలోనే ఇది అతిపెద్ద నేరమని గత ఏడాది జనవరి 24న విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. ఈ కేసును విచారిస్తున్న సెక్యూరిటీ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ) నుంచి కేసును సిట్ కు అప్పగించడానికి సుప్రీంకోర్టు గత వారం తిరస్కరించింది. భారత ప్రతిష్టను దెబ్బతీయడానికి విదేశాలకు చెందిన వారు వేసిన ఎత్తుగడని ఆదాని గ్రూపు హిండెన్ బర్గ్ ఆరోపణను తిరస్కరించింది. ప్రధాని నరేంద్ర మోడీకి చాలా సన్నిహితులైన గౌతమ్ ఆదాని పై వచ్చిన ఈ హిండెన్ బర్గ్ నివేదిక రాజకీయ వర్గాల్లో పెద్ద దుమారాన్ని లేపింది.

దీనిపై అనేక మంది సుప్రీం కోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాలను వేశారు.

హిండెన్ బర్గ్ కేవలం ఆదాని గ్రూపు షేర్లపైనే కాకుండా, దాని అంతర్జాతీయ బాండ్లపైన కూడా దృష్టి సారించింది. ఎయిర్ పోర్టులు, సిమెంట్, రక్షణ రంగం, వ్యవసాయం, డేటా కేంద్రాలు, పునరుత్పాదక రంగాలలో కూడా ఆదానీ గ్రూపు దేశ వ్యాప్తంగా విస్తరించిన విషయాన్ని 'ద వైర్' వెలికితీసింది. హిండెన్ బర్గ్ నివేదిక విడుదలైనప్పటి నుంచి జర్నలిస్టులపైన పెగాసెస్ ద్వారా దాడి జరుగుతోంది. రెగ్యులేటరీ అధికారులకు చూపించకుండా ఇతర దేశాల్లో వెబ్ కంపెనీలతో ఆదానీ గ్రూపు విస్తరించడంలో గౌతం ఆదాని కుమారుడు వినోద్ ఆదానీ కీలక పాత్ర పోషించాడని 'ఫర్బెస్' అన్న వార్తా సంస్థ తెలిపింది. హిండెన్బర్గ్ నివేదికలో వినోద్ ఆదాని పేరు కూడా ఉంది.

సింగపూర్లోని పినాకల్ ట్రేడ్ ఇన్వెస్ట్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ పరోక్షంగా వినోద్ ఆదానీ ఆధ్వర్యంలోనే ఉన్నదని 'ఫర్ బెస్' అనే వార్త సంస్థ తెలిపింది. రష్యాలోని రెండవ అతిపెద్ద వీటీబీ బ్యాంకు నుంచి రుణాలు పొందానికి ఆదానీ గ్రూపు ఈ కంపెనీ స్టాక్ ను ప్రమోట్ చేసింది.

వీటీటి ద్వారా రుణాలు పొందడానికి పినాకల్ ట్రేడ్ ఇన్వెస్ట్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రవేశించిందని, "2021 ఏప్రిల్ నాటికి 'పినాకల్' ట్రేడ్ 263 మిలియన్ డాలర్ల అప్పు తీసుకుని, దానికి సంబంధం లేని వారికి 258 మిలియన్ డార్ల అప్పిచ్చింది." అని రాసింది. రాష్యా బ్యాంకునుంచి రుణం తీసుకోవడానికి గ్యారంటీ కింద రెండు పెట్టుబడి నిధులను పినాకల్ ట్రేడ్ ఇన్వెస్ట్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ను గ్యారంటీగా చూపింది. ఈ పెట్టుబడి నిధులు ఆఫ్రో ఆసియా ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్ మెంట్ లిమిటెడ్, వరల్డ్ వైడ్ ఎమర్జింగ్ మార్కెట్ హెరీల్డింగ్ లిమిటెడ్కు చెందినవిగా గుర్తించారు.

జూన్ 2020, ఏప్రిల్ 2022లో భారత స్టాక్ ఎక్స్ఛేంజ్లో ముడిపెడుతూ "ప్రపంచ వ్యాపితంగా వంద శాతం మార్కెట్ హెరీల్డ్ లిమిటెడ్ గా ఉన్నటువంటి మార్షియస్ ఎక్రోపోలిస్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్మెంట్ లిమిటెడ్"కు వినోద్ ఆదానీనే యజమాని అని 'ఫర్బెన్' రాసింది. ఆదానీ ఎంటర్ ప్రైజెస్, ఆదానీ ట్రాన్స్ మిషన్, ఆదానీ ఓడరేవులు, ఆదానీ విద్యుత్ సంస్థల్లో ప్రపంచ వ్యాపితంగా నాలుగు బిలియన్ డాలర్ల విలువగల స్టాక్ ఆఫ్రో ఆసియన్ అండ్ వరల్డ్ వైడ్ వ్యాపారం సాగిస్తోంది. ఆఫ్రో ఆసియన్ అండ్ వరల్డ్ వైడ్కు ఎలాంటి సెక్యూరిటీ లేదని 'ఫ ర్ బెస్' గుర్తించింది. ఆదానీ విషయంలో రెగ్యులేటరీ అథారిటీ వైఫల్యాలపై విచారించడానికి సుప్రీం కోర్టుగత ఏడాది మార్చి రెండున సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏ.ఎం.సప్రె ఆధ్వర్యంలో అయిదుగురు సభ్యులు గల 'సెబీ' కమిటీని నియమించింది. విదేశాల్లో పెట్టిన పెట్టుబడుల రహస్యాన్ని సెబీ బహిర్గతం చేసిందని ఈ నిపుణుల కమిటీ గత మే 19న విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. ఇలాంటి ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత లేకపోవడం వల్ల నిజమైన యాజమాన్యం ఎవరో కనుక్కోవడం చాలా కష్టం. ఆదాని గ్రూపు కంపెనీలలోకి స్వేచ్ఛగా నిధులు ప్రవహించడంపై ఎక్రోఫోలిస్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్ మెంట్(ఎఫ్ఎఐ) ప్రశ్నలను లేవనెత్తింది. వ్యాపార కంపెనీల్లో బహిరంగంగా కనీసం 25 శాతం రిటైల్ పెట్టుబడులనుంచి, మ్యూచువల్ ఫండ్స్ నుంచి, ఎఫ్ పీఐల

నుంచి, బీమా కంపెనీల నుంచి పేర్లు ఉండాలి. ఆదానీ గ్రూపు సంస్థల్లో వినోద్ ఆదానీకి అధికారిక యజమాన్య స్థానం లేకపోయినప్పటికీ, కంపెనీలపైన అతని పట్టుంది. ఆదానీ గ్రూపులో అనేక మంది ఆడిటర్లు పనిచేసే వారు. అహ్మదాబాద్‌కు చెందిన ఒక స్వతంత్ర చార్టెడ్ అకౌంటెంట్ కంపెనీ షాహ్ ధారియా ఆదానీ గ్యాస్ కోసం నియమించిన ఏడాది తరువాత 2023 మే 2న వైదొలిగింది. అదొక చిన్న సంస్థ అని, దానికి ప్రస్తుత వెబ్ సైట్ లేదని హిండెన్ బర్గ్ పేర్కొంది. "షాహ్ దారియా ఆడిట్ భాగస్వాములు ఆదానీ ఎంటర్ ప్రైజెస్కు, ఆదాని గ్యాస్ కు సంతకాలు చేస్తూ ఆడిట్ను అమోదిస్తున్నారు. వాళ్ళు పెద్ద పెద్ద కంపెనీలకు లెక్కలు చూసేవారు." అని పేర్కొంది. ఆదానీ కంపెనీల లెక్కలను ఆడిట్ చేసే షా హ్ దారియా, ధర్మేష్ పరిక్ ల మధ్య సంబంధాలున్నాయి. ఆదానీ కంపెనీల కార్పొరేట్ పరిపాలన పట్ల ఈ రెండు కంపెనీలు విచారం వ్యక్తంచేసేవి. వాళ్ళకు ఆదానీ గ్రూపు ఏడుకోట్ల రూపాయలను ఇస్తోంది.

ఆదానీ కంపెనీ తనకు సంబంధం లేని మూడు కంపెనీలకు ఓడరేవులను బదిలీ చేయడం పట్ల గత మే 31న డెలాయిట్ ఆడిట్ కంపెనీ తన నిరసన వ్యక్తం చేసింది. సంబంధం లేని కంపెనీలని ఆడిటర్ నిర్ధారణ చేయలేదని డెలాయిట్ చెప్పింది. ఆదానీ ఓడరేవులు, ప్రత్యేక ఆర్థిక మండళ్ళకు ఉన్న చట్టబద్ధమైన ఆడిటర్ పదవి నుంచి డెలాయిట్ గత ఆగస్టులో వైదలిగింది. బయటనుంచి చేసే పరిశీలనకు కంపెనీ తిరస్కరించిందని డెలాయిట్ ప్రకటించింది. ఆదానీ కంపెనీల గురించి హిండెన్ బర్గ్ చేసిన ఆరోపణలపై సెబీ విచారణ జరుపుతోంది కనుక ఈనిర్ణయం తీసుకుంది. ఆదానీ కంపెనీల 'విస్తృతమైన ఆడిట్' ఇవ్వలేదన్న కారణంతో డెలాయిట్ ఆడిట్ కంపెనీ వైదొలిగినట్టు ఆదాని పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనిమికల్ జోన్ చెప్పిందని 'టెలిగ్రాఫ్స్' రాసింది. హెరీవె ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ వంటి వివాదాస్పదమైన కాంట్రాక్ట్ కంపెనీలతో ఆదానీ గ్రూపు సంబంధాలను పెట్టుకుందని 'బ్లూమ్ బర్గ్' కూడా రాసింది. ఆదానీకి చెందిన పీ.ఎం.సీ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ అనే వ్యాపార సంస్థ మరో రెండు సంస్థలతో కలిసి దిగుమతి చేసుకునే మౌలిక సదుపాయాల సరులకు 15 వందల కోట్లరూపాయల వరకు ధరలను పెంచేసింది. గౌతం ఆదానీ వ్యాపార సామ్రాజ్యంలోకి డబ్బును ప్రవహింప చేయడానికి ఈ సంస్థ పనిచేసిందని భారత ప్రభుత్వం 2014లో ఆరోపించినట్టు ఆ నివేదిక తెలిపింది.

తన కంపెనీలపై వచ్చిన ఆరోపణలన్నీ సత్యదూరమని 2017లో డిస్ట్రిక్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ తీర్పు ఇచ్చిందని, దిగుమతులన్నీ న్యాయబద్ధంగానే ఉన్నాయని ఆదానీ గ్రూప్ పేర్కొంది. హెరీవె కంపెనీ ఆదానీ గ్రూపుకు సంబంధించిందని, మేలో ఆదానీ పోర్ట్స్ కంపెనీ దానికి నిధులు మళ్ళించి నందుకు ఆడిటర్లు ఎందుకు అభ్యంతరం చెప్పారో చెప్పలేకపోక పోవడం ఆసక్తికరమైన అంశం. పిఎంసీ అనేది ఆదానీకి సంబంధించిన కంపెనీనే అని, ఆదానీ జాబితా కంపెనీల నుంచి బహిరంగంగా డబ్బును లాగేసిందని హిండెన్ బర్గ్ నిర్మొహమాటంగా చెప్పింది. మార్కెట్ను క్రమబద్ధీకరించడంలో స్టాకు దశాబ్దకాలంగా తారుమారుచేస్తున్నారని పరిశోధనాత్మక రిపోర్టింగ్ కు సంబంధించిన ఆర్గనైజింగ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు (ఓసీసీఆర్పి) 2023 సెప్టెంబర్ 1న గుర్తించింది. స్టాక్ మార్కెట్ను ఆదానీ తారుమారుచేసినట్టు 2014లో డీఆర్ఎస్ఐ నుంచి నివేదిక అందినా సెబీ పట్టించుకోలేదని ఆరోపిస్తూ ఆదాని హిండెన్ బర్గ్ కేసుపైన సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలయ్యాయి.

''ఆదానీ గ్రూపు స్టాక్ మార్కెట్ను తారుమారు చేయడం ద్వారా దిగుమతి చేసుకునే విద్యుత్ రంగ పరికరాల విలువలను పెంచి ఆదానీ గ్రూపులోకి నిధులను ప్రవహింప చేసింది" అని సెబీ చైర్పర్సన్ యూ.కే. సిన్హాకు 2014 జనవరి 31న డీఆర్ఎస్ఐ ఒక లేఖ పంపించిందని ఆ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఆదానీ గ్రూపులోకి 2 వేల, 323 కోట్ల రూపాయలు ప్రవహింప చేసినట్టు యాంటీ స్మగ్లింగ్ ఏజెన్సీ విచారించిన కేసుకు సంబంధించిన సీడీని సాక్ష్యంగా డీఆర్ఐ ఆ లేఖతో పాటు పంపింది. ఓసీసీఆర్ పి నివేదికను గార్డియన్, ఫైనాన్షియల్ టైమ్స్ పత్రికలు కూడా ప్రచురించాయి.

సెబీ చైర్మన్‌గా ఉన్న సిన్హా 2022లో ఆదానీ గ్రూపు స్వాధీనం చేసుకున్న ఎన్ డీ టీ వీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కూడా ఉన్నారు. "ద మిస్టరీ ఆఫ్ ఆదాని కోల్ ఇంపోర్ట్స్ దట్ క్వైట్ డబుల్ ఇన్ వ్యాల్యూ" అన్న శీర్షికతో ఫైనాన్షియల్ టైమ్స్ ఒక

కథనాన్ని ప్రచురించింది. "దేశంలో అతి పెద్ద బొగ్గు దిగుమతి ప్రైవేటు కంపెనీ ఇంధనం ధరలను విపరీతంగా పెంచేసింది. దీని వల్ల లక్షలాది మంది భారతీయ వినోయోగదారులు, వ్యాపారులు చెల్లించే విద్యుత్ చార్జీలు విపరీతంగా పెరిగాయి" అని పేర్కొంది. ఆదాని "మోడీ కి రాక్ఫెల్లర్ "(అమెరికా వ్యాపార దిగ్గజం) లాంటి వాడని రాస్తూ, గత పదేళ్ళలో అతని ఆదాయం విపరీతంగా పెరిగిందని ఫైనాన్స్ టైమ్స్ పేర్కొంది. 'ద వైర్' ఎడిటర్ సిద్ధార్థ వరదరాజన్, ఆర్గనైజింగ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజక్టు(ఓసీసీఆర్పి)కు చెందిన ఆనంద్ మాంగ్నలే అనే జర్నలిస్టుల సెల్ ఫోన్లలోకి పెగాసెస్ స్పైవేర్ను పంపించిందని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ సెక్యూరిటీ లాబ్ నిర్ధారించినట్టు 'వాషింగ్టన్ పోస్ట్' వెల్లడించింది. భారతీయ భద్రతా చట్టాన్ని అతిక్రమిస్తూ ఆదానీ గ్రూపు పబ్లిక్ స్టాక్ లోకి వందల లక్షల మిలియన్ల డాలర్లను ఆదాని సోదరుడు రహస్యంగా పంపించినట్టు ఆరోపిస్తూ ఓసీసీఆర్పి ఒక కథనాన్ని ప్రచురించడానికి వారం రోజుల ముందు ఆదానీకి మెయిలు పంపి ఆయన అభిప్రాయాన్ని కోరింది. ఓసీసీఆర్పి విచారణ జరిగిన 24 గంటల కల్లా దాని ఎడిటర్ ఆనంద్ మాగ్నలే ఫోన్లో పెగాసెస్ స్పై వేర్ను పంపినట్టు అమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఫోరెన్సిక్ ల్యాబ్ తెలిపింది.

భారతదేశంలోని కొందరి సెల్ఫోన్లలోకి పెగాసెస్ పంపినట్టు 2023 జూన్లో జరిపిన పరిశీలనలో బైటపడిందని అమ్నెస్టీ తెలిపింది. ఇది జరిగిన కొన్ని నెలలకు ఒక కొత్త వాణిజ్య స్పైవేర్ను భారతదేశం కొనుగోలు చేయబోతోందని పత్రికల్లో వార్తలు వచ్చాయి. ఐ ఫోన్ వాడకం దార్లపై 'ప్రభుత్వ చౌరవతోనే దాడులు జరగబోతున్నాయని ప్రపంచ వ్యాపితంగా ఒక హెచ్చరిక జారీచేసింది. వరదరాజన్, ఆనంద్ మాగ్నలే లతో పాటు అనేక మంది జర్నలిస్టులకు, రాజకీయ నాయకులకు కూడా ఈ హెచ్చరికలు అందాయి. ఆదానీ పైన విమర్శలు గుప్పించే మహువామొయిత్రా, ఆనంద్ మాగ్నలే తోపాటు ఓసీసీఆర్పి కు పనిచేస్తున్న రవి నాయర్ లాంటి వారు కూడా దీనిపైన ప్రజల్లోకి వెళ్లారు.

**('ద వైర్' సౌజన్యంతో 'మన తెలంగాణ'లో వచ్చిన కథనం)**

## ఫెడరేషన్ జిల్లా శాఖలకు సర్క్యులర్

నూతన సంవత్సర శుభాకాంక్షలు

జర్నలిస్టుల ఇంటి స్థలాల దరఖాస్తుకు జనవరి 6 ఆఖరి తేదీ ఈ అంశం దృష్టిలో పెట్టుకుని జిల్లా శాఖలు ఈ దిగువ పేర్కొన్న అంశాలపై దృష్టి పెట్టండి.

ఇప్పటికే అన్ని జిల్లాల్లో సమాచార శాఖ ఇంటి స్థలాల దరఖాస్తుల ఆధారంగా వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసింది. ఆ గ్రూపులకు సంబంధించిన సమాచారం రాని వారి జాబితాను తీసుకొని సమగ్రమైన దరఖాస్తుతో ఆ గ్రూపుల్లో చేరే ఏర్పాటు చూడండి. జిల్లాలో ఇన్చార్జి మంత్రి అధ్యక్షతన జిల్లా కలెక్టర్ ఆర్డీవో డి పి ఆర్ ఓ తోపాటుగా ముగ్గురు జర్నలిస్టులు సభ్యులుగా కమిటీలు ఏర్పాటు అయ్యాయి. ఆ కమిటీలు సమావేశమై వచ్చిన దరఖాస్తుల ఆధారంగా మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రం వరకు ఏఏ ప్రాంతాలలో ఎంత మంది జర్నలిస్టులకు స్థలాలు ఎంత అవసరమనే అంశంపై చర్చించి భూ సేకరణకు సంబంధించిన ఏర్పాటు చేస్తారు. ఆ కమిటీ దృష్టికి దిగువ సూచించిన అంశాలను తీసుకువెళ్లి పరిష్కారానికి ప్రయత్నించండి.

1. అర్హత గల జర్నలిస్టులందరూ గ్రూపులలో చేరారో లేదో చూసి అందరిని చేర్చే ప్రయత్నం చేయండి.

2. చేరిన వారికి సంబంధించి పెండింగ్లో ఉన్న సమస్యలు పరిష్కరించి వారి దరఖాస్తులు ఆమోదం పొందేలా చూడండి.

3. జిల్లాలో అర్హులైన అక్రిడిటేషన్ లేని జర్నలిస్టుల జాబితాలను తయారుచేసి జిల్లా ఇన్చార్జిమంత్రికి, కలెక్టర్కు, కమిటీలోని సభ్యులందరికీ అందజేయండి. ఆ జాబితాను రాష్ట్ర కేంద్రానికి పంపితే వాటిని రాష్ట్ర సమాచార కమిషన్ దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుంది.

ఇంటి స్థలాల కేటాయింపుకు సంబంధించి జిల్లా శాఖలు తక్షణం స్పందించి పైన పేర్కొన్న అంశాలపై దృష్టి సారించి జర్నలిస్టుల ఇంటి స్థలాల సమస్య పరిష్కారానికి ప్రయత్నించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

జి ఆంజనేయులు

ప్రధాన కార్యదర్శి, ఏపీ డబ్ల్యూ జె ఎఫ్



## ఫోటోగ్రాఫర్ రాజేష్ మృతి

హైదరాబాద్‌లో నమస్తే తెలంగాణ ఫోటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న రాజేష్‌కు హఠాత్తుగా గుండె పోటు రావడంతో స్థానిక యశోదా ఆస్పత్రిలో చేర్పించారు. ఆయన చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు (ఎన్.ఎ.జె) తెలంగాణ కన్వీనర్ ఎం.ఎ.రవూఫ్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

## ఆంధ్రప్రభ విలేకరి సాయి మృతి



యువ జర్నలిస్టు, ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం ఆంధ్రప్రభ విలేకరి సాయి ఆకస్మాత్తుగా చనిపోయారు. ఆయన ఆకస్మిక మృతి పట్ల తోటి జర్నలిస్టులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన మృతిపట్ల నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు (ఎన్.ఎ.జె) తెలంగాణ కన్వీనర్ ఎం.ఎ.రవూఫ్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. సాయి కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు.

## జనజ్వాల ఎడిటర్ భాను ఆకస్మిక మృతి

విజయవాడ :జనజ్వాల వీక్లీ న్యూస్ పేపర్ ఎడిటర్, సామ్నా విజయవాడ నగర ఉపాధ్యక్షుడు డి. భాను ప్రసాద్ కార్డియాక్ అరెస్ట్‌తో మరణించారు. ఐదు రోజులుగా విజయవాడలోని రమేష్ హాస్పటల్లో అత్యవసర చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. సీనియర్ జర్నలిస్ట్ శ్రీనివాసరావు కుమారుడైన భాను ప్రసాద్ వయసు 39 సంవత్సరాలు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విశాలాంధ్ర దినపత్రికలో ఏడేళ్లకు పైగా పనిచేసి కమ్యూనిజం పత్రిక నిర్వహణతో పాటు అకౌంటెంట్ బాధ్యతలు నిర్వహించారు. తదనంతరం 2012 వ సంవత్సరం నుంచి జనజ్వాల న్యూస్ వీక్లీని దాదాపు పదేళ్లపాటు నడిపారు. వినయ, విధేయతలకు పెట్టింది పేరుగా, వివాదాలకు తావు లేని మంచి వ్యక్తిగా గుర్తింపు పొందారు. చిన్న పత్రికల సంఘం సామ్నా నగర ఉపాధ్యక్షుడిగా కూడా బాధ్యతలను చురుకుగా నిర్వహించేవారు. భాను ప్రసాద్ అకాల మృతికి ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.కలిమిశ్రీ, ఎం.బి.నాథన్‌లు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే ఇటువంటి విషాదకర సంఘటన జరగటం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు.



**విజయవాడలో పర్యావరణ పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సభలో మాట్లాడుతున్న ఫెడరేషన్ అధ్యక్షులు ఎస్.వెంకట్రావు**

**ఆంధ్రజ్యోతి ఫోటో జర్నలిస్టు కృష్ణపై దాడి, కర్నూలులో ఈనాడు కార్యాలయంపై జరిగిన దాడులను నిరసిస్తూ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో జరిగిన ఆందోళన కార్యక్రమాలు**




ఒంగోలులో





కర్నూలులో

ఏలూరులో





భీమవరంలో

వరుసగా నాలుగవ ఏడాది

# "వైఎస్సార్ ఆసరా"

గత ప్రభుత్వం రుణాలు కట్టొద్దు పొదుపు సంఘాల తరపున మేమే చెల్లిస్తామని 2014లో హామీ ఇచ్చి ఎగ్గొట్టిన కారణంగా..

.. రాష్ట్రవ్యాప్తంగా చితికిపోయిన దాదాపు **7.98 లక్షల** స్వయం సహాయక సంఘాల్లోని సుమారు **78.94 లక్షల** మంది అక్కచెల్లెమ్మలకు ఊరటనిస్తూ..

**4 వాయిదాల్లో అదే అక్కచెల్లెమ్మలకు 2019 ఎన్నికల నాటికి SLBC తుది జాబితా ప్రకారం ఉన్న రూ. 25,571 కోట్ల** రుణాన్ని తామే చెల్లిస్తామని మేనిఫెస్టోలో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ, ఇప్పటి వరకు 4 విడతల్లో **రూ. 25,571 కోట్ల** ఆర్థిక సాయాన్ని అందించిన జగనన్న ప్రభుత్వం..





## థాంక్యూ జగనన్న..

అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటి వరకు వివిధ పథకాల ద్వారా అక్కచెల్లెమ్మలకు మన జగనన్న ప్రభుత్వం అందించిన లబ్ధి

అక్షరాల రూ. **2,66,772.55** కోట్లు..

**ఇది జగనన్న ప్రభుత్వం.. మహిళా పక్షపాత ప్రభుత్వం...**

వైఎస్సార్ ఆసరా - పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు బాసట

జారీ చేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం